జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, మార్చి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




## పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు వదిలేలోపే

# పునరావాసం పూర్తి

- 2026 డిసెంబర్ నాటికి పునరావాసం...2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి
- రూ.829 కోట్లు నేరుగా నిర్వాసితుల అకౌంట్లో జమ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిది
- మాది మాయ మాటలు చెప్పే ప్రభుత్వం కాదు.. చెప్పింది చేసి చూపించే ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో మిమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేడు
- అర్హులైన ప్రతిఒక్కరికీ పరిహారం అందిస్తాం... ఆదాయం, జీవనప్రమాణాలు పెంచేందుకు చర్యలు
- పోలవరం నిర్వాసితులతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు పడ్డామన్న నిర్వాసితులు

**పోలవరం:** 'పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 2027 నాటికి పునరావాసం పూర్తి చేయాలని సంకల్పంతో ముందుకెళు_న్నాం. వీలైతే పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు వదలకముందే నిర్వాసితులందరికీ పునరావాసం పూర్తి చేస్తాం. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి, 2026 డిసెంబర్‌కే పునరావాసం కల్పించం కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధికారులను కోరుతున్నా. అందుకు అవసరమైన సిబ్బందిని ఇస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు గురువారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం నిర్వాసితులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. మిగతా.. 2లో





# 'పోలవరం కూలీ'.. పునరాగమనం!



### - త్యాగాల పునాదులపై ఆశల సౌధంలో కదలిక

(భూమా బాబు)

పోలవరం... కేవలం ఒక ప్రాజెక్టు కాదు, ఇది లక్షలాది మంది ఆశలకు ప్రతిరూపం. తరతరాలుగా జీవించిన నేలను, ఇళ్లను, బంధాలను వదులుకొని, రేపటి తరం కోసం త్యాగాలు చేసిన నిర్వాసితుల కన్నీటి గాథ. ఈ ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన ఆ కుటుంబాల వేదన వర్ణనాతీతం. గత ప్రభుత్వం నిర్లక్ష్యం, ఆలస్యం వారి జీవితాలను దుర్భరం చేశాయి.

కానీ, చీకటిని చీల్చుకుంటూ వెలుగు రేఖలా పోలవరం మొదటి కూలీ.. చంద్రబాబు నాయుడు వారి జీవితాల్లోకి వచ్చారు. పోలవరం ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించి, నిర్వాసితులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, వారి కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. "పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు విడిచిపెట్టకముందే నిర్వాసితులందరికీ మిగతా.. 2లో

# పి-4పై పేదలకే అవగాహన అవసరం



- ధనవంతులపై ఆధారపడకుండా చూడాలి
- బాబు ఆలోచన అర్థం చేసుకునే యత్నమే ముఖ్యం
- అందుకే పి-4పై ప్రచారం అవసరం
- చంద్రబాబు లక్ష్యం పెద్దది
- కానీ అర్థమయ్యేది ఎంత మందికి?

**అమరావతి,మహానాడు:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు P4 అనే కాన్సెప్ట్‌ను ఎన్నికల ముందు నుంచీ చెబుతున్నారు. ఈ ఉగాది నుంచి అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దానికి " మార్గదర్శి – బంగారు కుటుంబం" అని పేరు పెట్టారు. ఇది ప్రభుత్వ పథకం కాదు. ప్రభుత్వం నుంచి పైసా మంజూరు చేయాల్సిన అవసరం లేదు. డబ్బు ఉన్న వాళ్లు.. డబ్బు లేని పేద కుటుంబాలకు అండగా ఉండటం అన్న కాన్సెప్ట్ మీద దీన్ని సిద్ధం చేశారు. ఆ ప్రకారం పేదల్ని నమోదు చేశారు. ఇప్పుడు మాకు డబ్బులున్నాయి.. ఆదుకుంటాం అని ముందుకు వచ్చే వారిని ఎంపిక చేసి, ఆయా కుటుంబాలను దాదాపుగా దత్తత ఇస్తారు.

### ఈ స్కీమ్ కాన్సెప్ట్ ఎంత మందికి అర్థమవుతుంది?

ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్దేశం పేద కుటుంబాలను పెద్ద కుటుంబాలు పోషించాలని కాదు. ఆ కుటుంబ సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని మెరుగుపరిచేలా సాయం చేయడం. అంటే ఆయా కుటుంబాల్లో చదువుకునేవారు ఉంటే, వారికి అవసరమైన సాయం చేయడం.. స్కిల్స్ తగ్గ పని చేయని వాళ్లు ఉంటే, దానికి తగ్గ ఉపాధి కల్పించడం. ఓ రకంగా చెప్పాలంటే.. గైడెన్స్ ఇవ్వడం. సరైన దారిలో ఆ కుటుంబాన్ని పయనించేలా చేసి, అభివృద్ధి చెందేలా చేయడం. ఈ క్రమంలో కొంత మంది చదువులకు..ఇతర అవసరాలకు ఆర్థిక సాయం చేయవచ్చు. కానీ ఆ పేద కుటుంబాలు.. తమను ఇక ఆ మిగతా.. 2లో



## వందశాతం రుణమాఫీ జరిగితే నేను రాజకీయాల్లో ఉండను

- ఇది నా చాలెంజ్.. ముఖ్యమంత్రి స్వీకరిస్తారా?
- తెలంగాణ పైన గన్ను ఎక్కుపెట్టిన రైఫిల్ రెడ్డి రేవంత్ రెడ్డి
- తెలంగాణ జాతి పిత ముమ్మాటికి కేసీఆర్
- తెలంగాణ బూతు పిత రేవంత్ రెడ్డినే
- పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు
- బయట మాట్లాడుతున్న రాము కరెక్టా? సభలో మాట్లాడుతున్న రెమో కరెక్టా?
- రేవంత్ ఒక్కడికే కుటుంబం ఉందా?
- ఉద్యోగుల డిఏకు పైసలు లేవు.. ఆరు గ్యారెంటీల అమలకు పైసలు లేవు
- కానీ వేల కోట్ల టెండర్లకు పైసలు ఎక్కడివి?
- ముఖ్యమంత్రి ఏమనుకున్నా మాకు ఫరక్ పడదు
- శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌పై విరుచుకుపడిన కెటిఆర్

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా కెటిఆర్, రేవంత్ రెడ్డి వాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

అసెంబ్లీలో జరిగిన చర్చల్లో కెటిఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ముఖ్యమంత్రికి ఇంత అసహనం పనికిరాదు. ముఖ్యమంత్రికి ఇంత ఆవేశం, నిస్పృహ ఎందుకో అర్థం కావడం లేదు. ముఖ్యమంత్రిలో ఒక అపరిచితుడు దాగి ఉన్నాడు," అని మిగతా.. 2లో

## నేను తలచుకుంటే

# మీ ఖాందాన్ జైల్లో ఉండేది

- నేను విజ్ఞత చూపించినందుకే బయట ఉన్నారు
- నన్ను 16 రోజులు చీకటి గదిలో ఉంచారు
- బిడ్డ లగ్నపత్రిక రాసుకోకుండా అడ్డుకున్నారు
- నన్ను హింసించిన వాడికి దేవుడే శిక్షవేశాడు
- కొండపోచమ్మ నుంచి మీ ఫామ్ గౌస్‌కు నీళ్లు తీసుకెళ్లింది నిజం కాదా?
- రంగనాయక సాగర్ దగ్గర హరీష్ రావుకి ఫామ్ హౌసు ఉంది నిజం కాదా?
- మీ తెలివితేటలు తెలంగా కోసం ఉపయోగించండి
- కేటీఆర్ వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్



**హైదరాబాద్:** మల్లన్న సాగర్ శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుల నుంచే మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్ కు నీళ్లు తీసుకొచ్చాం. మీ లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్టు గుండుసున్నా. లగ చర్ల భూసేకరణపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఏటిగడ్డ కిష్టాపూర్, వేముల ఘాట్ భూసేకరణ విషయంలో బూట్లతో తొక్కించింది మీరు.

మేం కూడా ఆనాడు అక్కడ ధర్నా చేశాం. కానీ మేం భూసేకరణకు వ్యతిరేకంగా ధర్నా చేయలేదు. పరిహారం పెంపుకోసం చేశాం. మేం కొట్లాడటం వల్లే మల్లన్న సాగర్ బాధితులకు పరిహారం పెంచారు. కొండపోచమ్మ నుంచి మీ ఫామ్ గౌస్ కు నీళ్లు తీసుకెళ్లింది నిజం కాదా? రంగనాయక సాగర్ దగ్గర హరీష్ రావుకి ఫామ్ హౌసు ఉంది నిజం కాదా? దీనిపై విచారణకు మీరు సిద్ధమా? మిగతా.. 2లో



## సీతక్క సరే.. నీకెందుకు తెలుగురాదు అక్బర్?

- తెలుగు తెలియకుండా అసెంబ్లీలో ఏం మాట్లాడుతున్నారో నీకేం అర్థమవుతుంది?
- తెలుగురాకపోతే మీకు రాష్ట్రంలో ఏం సమస్యలు తెలుస్తాయి?
- ప్రసంగం దంచేసి వెళితే సరిపోతుందా? అంత పొగరైతే ఎలా?
- మజ్లిస్ నేత అక్బరుద్దీన్ ఒవైసీకి ఆకునూరి మురళి ఘాటు జవాబు

3లో..



07

గత ప్రభుత్వ అహంభావం, కక్షతో పోలవరం ప్రాజెక్టుకు నష్టం



03

పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికే 'డ్వాక్రా'!

- నారీమణులు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు
- అవకాశాలు ఇవ్వాలేకానీ అద్భుతాలు సృష్టిస్తారు
- అతివలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- ఎలీప్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన నారా భువనేశ్వరి

3లో





10

భూముల వేలం వద్దని అప్పుడు మీరే సెలవిచ్చారు సారూ!



08

క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ మాసం

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

2

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, మార్చి 2025 ||

## వందశాతం రుణమాఫీ జరిగితే నేను రాజకీయాల్లో ఉండను

మొదటి పేజీ తరువాయి..

కెటిఆర్ వ్యాఖ్యానించారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆర్థిక విధానాలపై కెటిఆర్ సూటిగా ప్రశ్నలు సంధించారు. “ఎవరు నమ్మతలేరు.. అప్పు పుడుత లేదు.. దివాలా తీసినమని బయట చెప్తున్నారు. కానీ ఇక్కడికి వచ్చి లక్షా 58 వేల కోట్ల అప్పు చేసినానని రొమ్ము విరుచుకొని చెప్తున్నారు. బయట మాట్లాడుతున్న రాము కరెక్టా? సభలో మాట్లాడుతున్న రెమో కరెక్టా? రేవంత్ రెడ్డి చెప్పాలి,” అని కెటిఆర్ డిమాండ్ చేశారు.

“దావోస్‌లో పెట్టుబడులు వరదలా తన్నుకొని వచ్చాయని చెప్పుకున్నారు. ఐదు గ్యారంటీలు అమలు చేశాము. సంక్షేమం అద్భుతంగా ఉందని చెప్పుకున్నారు. మరి 71 వేల కోట్ల ఆదాయం తగ్గిందని ముఖ్యమంత్రి ఎందుకు చెప్పారో వివరణ ఇవ్వాలి” అని ప్రశ్నించారు.

ఉద్యోగుల డిఏకు పైసలు లేవు.. ఆరు గ్యారెంటీల అమలకు పైసలు లేవు.. తులం బంగారానికి పైసలు లేవు అని చెప్పే ముఖ్యమంత్రి... హెచ్ఎండిఏకు 20 వేల కోట్లతో టెండర్లు, ఏడు వేల కోట్లతో జిహెచ్ఎంసిలో టెండర్లు, వాటర్ వర్క్స్ లో 14 వేల కోట్ల టెండర్లు, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ లో 4400 కోట్లతో టెండర్లు, ఫ్యూచర్ సిటీలో ఆరు లైన్ల మెయిన్ రోడ్డు రెండు వైపులా రెండు సర్వీసు రోడ్ల మొత్తం 10 లైన్లకు 5000 కోట్లు. నిధులు ఎక్కడి నుంచి వచ్చినవి?” అని నిలదీశారు.

“లక్షన్నర కోట్లతో మూసి సుందరీకరణ అని చెప్తారు. వీటన్నిటికీ డబ్బులు ఉన్నాయి. కానీ ఆరు గ్యారెంటీల అమలుకు పైసలు లేవా? తులం బంగారానికి పైసలు లేవా? మహిళలకు ఇచ్చేందుకు నెలకు 2500 లేవా?” అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కొడంగల్ నియోజక వర్గంలో గాని.. నా నియోజకవర్గం సిరిసిల్లలో కానీ ఏ ఊరికైనా వెళ్లి ఎవరైనా ఒక రైతును వందకు వంద శాతం రుణమాఫీ అయిందా అని అడుగుదాం. అయిందని చెప్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటా. ఇది నా చాలెంజ్, ముఖ్యమంత్రి స్వీకరిస్తారా?” అని కెటిఆర్ సవాల్ విసిరారు.

డిసెంబర్ 7 న ఇందిరమ్మ రాజ్యం వస్తుంది. రెండు లక్షల రుణమాఫీ మీద 9 తారీకు సంతకం పెడతానని ముఖ్యమంత్రి చెప్పారు. మరి చేశారా? అనాడు పీసీసీ ప్రెసిడెంట్ గా రైతుబంధును ఆపిందే రేవంత్ రెడ్డి. ఎలక్షన్ కమిషన్కు రేవంత్ రెడ్డి స్వయంగా లెటర్ రాశారు. 7600 కోట్లు రైతుబంధు పైసల్ని ఆపి మా మీద దుష్ప్రచారం చేశారు” అని ఆరోపించారు.

100 రోజుల్లోనే 6 గ్యారెంటీలను అమలు చేస్తామని తొడలు కొట్టి అఫిడవిట్లు రాసి బాండ్ పేపర్లను దేవుళ్ళ ముందట పెట్టింది ఎవరు? వంద రోజుల్లోనే తులం బంగారం ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదు? ప్రజలు కాంగ్రెస్ నేతలని గోల్డ్ అనుకుంటే ఇప్పుడు వారు రోల్డ్ గోల్డ్ అని తెలిసిపోయింది. లంకె బిందెలు దొరికేదాకా ప్రజలు హామీల అమలు కోసం వేచి చూడాలా?” అని విమర్శించారు.

రేవంత్ ఒక్కడికే కుటుంబం ఉందా? నీతులు చెప్పేముందు తన చరిత్ర తెలుసుకోవాలి. రేవంత్ రెడ్డి లెక్కలు తప్పో, కాగ్ లెక్కలు తప్పో ముఖ్యమంత్రి చెప్పాలి. కాగ్ లెక్కల ప్రకారం నెలకు 2750 కోట్లు అసలు, మిత్తి కలిపి ప్రభుత్వం కడుతుంది. దొడ్డు వడ్లకు, ఇతర పంటలకు మద్దతు ధర, బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పింది. ఇచ్చారా? మద్దతు ధర ఇస్తాం అన్నారు ఒక్కదానికైనా ఇచ్చారా? బోనస్ బోగస్ కాలేదా?” అని ప్రశ్నల వర్షం కురిపించారు.

ముఖ్యమంత్రి ఇంటి మీదికి డ్రోన్ పంపిస్తే ఆయన ఊరుకుంటాడా? ఆయన భార్యాపిల్లల ఫోటోలను ఇష్టం వచ్చినట్టు తీస్తామంటే ఊరుకుంటాడా? ఇది పద్ధతేనా? మీకే భార్య పిల్లలు ఉన్నారా? వేరే వాళ్లకు భార్య పిల్లలు లేరా? వాళ్లకు కుటుంబాలు ఉండవా? లేని రంకులు అంటగట్టి ఆనాడు ఇష్టమున్నట్టు మాట్లాడినప్పుడు ఇష్టం ఉన్న సంబంధాలు మాట్లాడినప్పుడు, ఆ రోజు నీతులు గుర్తుకు రాలేదా? మా ఇంట్లో పిల్లల్ని తిట్టింది ఈ కాంగ్రెస్ నేతలు కాదా? మా ఇంట్లోని మైనర్ పిల్లల్ని పట్టుకొని బూతులు మాట్లాడింది ముఖ్యమంత్రి కాదా?” అని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ముఖ్యమంత్రి ఏమనుకున్నా మాకు ఫరక్ పడదు

ముఖ్యమంత్రి ఏమనుకున్నా మాకు ఫరక్ పడదు. ఏం చేసినా ఫరక్ పడదు. పదవి, అధికారం శాశ్వతం అని ముఖ్యమంత్రి అనుకుంటున్నారు కానీ అవి ఏవీ శాశ్వతం కాదు. ముఖ్యమంత్రికి అపరిమిత అధికారాలు ఉండవు. ఆయన ఎవరిని జైలుకు పంపలేరు. కోర్టులు మాత్రమే ఆ పని చేయగలవు,” అని కేటీఆర్ స్పష్టం చేశారు. “రేవంత్ తిట్లన్నీ మాకు దీవెనలే రేవంత్ రెడ్డికి తుపాలకుల గురించి బాగా తెల్సు. తెలంగాణ పైన గన్ను ఎక్కుపెట్టిన రైఫిల్ రెడ్డి రేవంత్ రెడ్డి. తెలంగాణ జాతిపిత ముమ్మాటికి కేసీఆర్ తెలంగాణ బూతు పిత రేవంత్ రెడ్డినే,” అని కెటిఆర్ అన్నారు. “కాంగ్రెస్ ఎన్నో ప్రాజెక్టులు కట్టిందని చెపుతున్నారు కదా.. మరి 2014 ముందు ఇంత పంట దిగుబడి ఎందుకు లేదు? కేసీఆర్ వచ్చిన తర్వాతనే ఇంత దిగుబడి ఎలా సాధ్యం అయింది? అని కెటిఆర్ విమర్శించారు.

### పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు

పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు. పదవిలోకి వచ్చిన తర్వాత ఇంత ఫ్రస్టేషన్ రేవంత్‌కు ఎందుకో తెలియడం లేదు. కాంగ్రెస్‌కు ఓటు వేద్దామంటే భయపడే పరిస్థితి రేవంత్ వల్లే తెలంగాణలో వచ్చింది. రేవంత్ ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో, తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం చేసినా వచ్చిన ఫలితం ఏమిటో ప్రజలకు తెలుసు. రేవంత్ రెడ్డి ఎన్ని రోజులు మాట్లాడితే అంత మంచిది. రేవంత్ మాటలు విన్నాక మరో 20 ఏళ్లు కాంగ్రెస్‌కు ఎవరూ ఓటు వేయరు” అని కెటిఆర్ వ్యాఖ్యానించారు.

రేవంత్ తిట్లన్నీ మాకు దీవెనలే, ఆశీర్వాదాలే. తుపాకుల గురించి రేవంత్ రెడ్డికి బాగా తెలుసు. తెలంగాణపై గన్ ఎక్కుపెట్టిన రైఫిల్ రెడ్డి రేవంత్ రెడ్డే. పాత కాంగ్రెస్ నేతలను ఖతం చేసి పదవి లాక్కున్న వ్యక్తి రేవంత్ రెడ్డి. విఫల పాలనకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. అప్పుల్లో, అబద్ధాల్లో, క్రైం రేట్‌లో, అన్నదాతలు, నేతన్నల ఆత్మహత్యల్లో తెలంగాణ ఈజ్ రైజింగ్,” అని కేటీఆర్ ఆరోపించారు.



## పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు వదిలేలోపే పునరావాసం పూర్తి

మొదటి పేజీ తరువాయి..

### ఖర్చుచేసే ప్రతిపైసా నిర్వాసితులకే చెందాలి

2014లో మేము అధికారంలోకి రాకముందు నిర్వాసితులకు చాలా తక్కువ పరిహారం ఇచ్చారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక రూ.4,311 కోట్ల పరిహారం చెల్లించాం. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వం ఆ ఐదేళ్లలో ఒక్కసారి కూడా మీ గురించి ఆలోచించడం కానీ, పట్టించుకోవడం కానీ చేయలేదు. కనీసం మీ సమస్యల పట్ల ఆలోచించిన దాఖలాలు కూడా లేవు. పోలవరం పూర్తవ్వాలంటే తెలంగాణలోని 7 ముంపు మండలాలు ఏపీలో విలీనం చేయాలని అప్పట్లో ప్రధాని మోదీని ఒప్పించాం. వీలైనంత వరకు మీకు న్యాయం చేసి ఆదుకోవాలని ముందుకెళ్లాం.

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల అకౌంట్లో రూ.829 కోట్లు జమ చేశాం. 2014-19 మధ్య మా ప్రభుత్వం ఇచ్చే పరిహారం సరిపోదని ప్రతిపక్షంలో ఉన్న జగన్ రూ.10 లక్షలు పరిహారం ఇస్తానన్నాడు...ఇచ్చాడా.? ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో




ఒక్కపైసా బాధితులకు రూపాయి కూడా ఇచ్చింది లేదు. కనీసం వరదలు వచ్చినప్పుడు కూడా మిమ్మల్ని పట్టించుకోలేదు. మళ్లీ రానున్న రోజుల్లో మీ దగ్గరకు వచ్చి అది చేస్తాం... ఇది చేస్తాం అని చెప్పి మీ వద్దకు వస్తారు.

గత పాలకులు పోలవరం ప్రాజెక్టుకు ఏ గతి పట్టించారో చూశాం. 2019లో మా ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉండుంటే 2020కి ప్రాజెక్టు పూర్తయ్యేది. ఆలస్యం చేయడం వల్ల ఖర్చు భారీగా పెరిగి పోయాంది. రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ కడితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయింది. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నాం. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేశారు. ఖర్చు పెట్టే ప్రతిపైసా మీకే చెందాలి. ప్రజల సొమ్మును ప్రజల కోసమే ఖర్చు చేయాలి తప్ప దుర్వినియోగం చేయకూడదు.

### గత పాలకులు పోలవరం నిధులు మళ్లించారు

నేను సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని పనిచేశాను. 33 సార్లు ప్రాజెక్టును సందర్శించాను. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చేస్తాం. కొందరి పేర్లు తొలగించారని బాధితులు చెబుతున్నారు... విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం చెల్లిస్తాం%'% ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించారు.




ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే మీరు ఈ పాటికే స్థిరపడేవారు. పోలవరం హైడల్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రూ.2,500 కోట్ల ఆదాయం వచ్చేది. దాన్ని కూడా ఆలస్యం చేయడంతో అదనపు భారం పడి ఖర్చు కూడా పెరిగింది.

### మా ప్రభుత్వంలో మాయమాటలు చెప్పేవారు లేరు

పునరావాసం కల్పించిన తర్వాత మీ ఆదాయ మార్గాలు, జీవన ప్రమాణాలు పెరగడానికి చర్యలు తీసుకుంటాం మీరు బ్రహ్మాండంగా ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించారు. మీరు ధైర్యంగా ఉండండి. ఇది మీ ప్రభుత్వం... మనందరి ప్రభుత్వం. మంచిని మంచిగా చెప్తే మరింత మంచి జరుగుతుంది. మంచి చేసిన వారికి సహకరించకపోతే తప్పే అవుతుంది. ఈ ప్రభుత్వంలో దళారులు, దొంగలు, మోసగాళ్లు, మాయ మాటలు చెప్పేవారు అస్సలు లేరు. చేసే పని మాత్రమే చెప్పి చేసి చూపిస్తాం. ప్రాజెక్టు కోసం గిరిజనులు ఎక్కువ త్యాగం చేశారు. ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ.75 వేలు అదనంగా మన కూటమి ప్రభుత్వం అందిస్తోంది’ అని సీఎం చంద్రబాబు అన్నారు.

## పి-4పై పేదలకే అవగాహన అవసరం

మొదటి పేజీ తరువాయి..

పెద్ద కుటుంబాలు పోషిస్తాయని అనుకునే అవకాశం ఉంది. అక్కడే అసలు సమస్య వస్తుంది.

### పథకాలకు అలవాటు పడిన ప్రజల్ని మార్చడం కష్టం !

చాలా సినిమాల్లో ఇప్పటికే అనేక సార్లు విమర్శనాత్మకంగా ప్రభుత్వం ఇచ్చే పథకాల గురించి చర్చించారు. ఓ నిరుపేద కుటుంబానికి.. ఇల్లు వస్తుంది..రేషన్ వస్తుంది.. నెలకు పింఛన్ వస్తుంది.. మళ్లీ వివిధ పథకాల నిధులు వస్తాయి. ఉద్యోగం లేకపోయినా.. పని చేయకపోయినా ఆ కుటుంబానికి ఢోకా ఉండదు. కానీ పని చేసుకునేవాడు మాత్రం రోజంతా కష్టపడి పన్నులు కట్టాల్సి వస్తుంది. అంటే పథకాలకు అలవాటుపడి పోయిన వారు పనులు చేయడానికి ఆసక్తి చూపించారు. వారు ఎదిగేందుకూ ఆసక్తి చూపించరు. అలాంటి వారిని ఈ P4 ద్వారా వృద్ధిలోకి తీసుకురావాలన్న ప్రయత్నం ఎంత మేర సక్సెస్ అవుతుందన్నది చర్చనీయాంశమే.

### చంద్రబాబు ఆలోచన ఉత్తమం- ఫలితాలు అలాగే ఉంటే సామాజిక అభివృద్ధి

చంద్రబాబు ఆలోచన అత్యుత్తమంగా ఉంది. పేదరికం అనేది శాపం. ఉచితంగా వచ్చేదాని మీద ఆధారపడకుండా, సొంతంగా సంపాదించుకుంటూ పోతే అభివృద్ధి పెద్ద విషయం కాదు. కానీ చిన్న చిన్న జబర్దస్త్ ఆర్టిస్టులు వస్తున్నారంటే.. పోలోమంటూ వచ్చి వారిని చూసి.. రోడ్డంతా జామ్ చేసి పోయే వాళ్లు ఉన్న సమాజంలో.. చంద్రబాబు ఆలోచనను అర్థం చేసుకుని తాము అభివృద్ధి చెందేందుకు..ఎదిగేందుకు చంద్రబాబు డబ్బులున్నవాళ్లను నిచ్చెనలుగా పెడుతున్నాడని ..దాన్ని ఉపయోగించుకోవాలని అనుకునేవారు ఎందరు ఉంటారు?. అందుకే ఆ కాన్సెప్ట్ ను.. ముందుగా పేదలకు ఆదుకునేందుకు ముందుకు వచ్చేవారికి కాకుండా.. పేదలకు అవగాహన కల్పించేలా చేయాలి. లేకపోతే ఉన్నతమైన ఆలోచన నిర్వీర్యం అయిపోతుంది.



## ‘పోలవరం కూలీ’.. పునరాగమనం!

మొదటి పేజీ తరువాయి..

పునరావాసం పూర్తి చేస్తాం. ఆ తర్వాతనే ప్రాజెక్టును ప్రారంభిస్తాం” అని హామీ ఇవ్వడం వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేసింది.

“ఖర్చుచేసే ప్రతి పైసా నిర్వాసితులకే చెందాలి. ఇది మీ ప్రభుత్వం... మనందరి ప్రభుత్వం” అని చంద్రబాబు చెప్పిన మాటలు నిర్వాసితుల్లో భరోసాను నింపాయి. గతంలో జరిగిన అన్యాయాలను సరిదిద్ది, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దళారులకు, మోసగాళ్లకు తావు లేకుండా, పారదర్శకంగా పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

“మాది మాయ మాటలు చెప్పే ప్రభుత్వం కాదు.. చెప్పింది చేసి చూపించే ప్రభుత్వం” అని చంద్రబాబు చెప్పిన మాటలు, గతంలో మోసపోయిన నిర్వాసితుల్లో నమ్మకాన్ని కలిగించాయి. “పునరావాసం కల్పించిన తర్వాత మీ ఆదాయ మార్గాలు, జీవన ప్రమాణాలు పెరగడానికి చర్యలు తీసుకుంటాం” అని చెప్పడం వారి భవిష్యత్తుపై కొత్త ఆశలను రేకెత్తించింది.

పోలవరం నిర్వాసితులు ఎన్నో త్యాగాలు చేశారు. వారి త్యాగాలకు ప్రతిఫలంగా, వారికి న్యాయం జరగాలి. వారి కష్టాలు తీరాలి. వారి జీవితాల్లో వెలుగులు నిండాలి. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, పోలవరం నిర్వాసితుల కలలు నిజం కావాలని ఆశిద్దాం.



## నేను తలచుకుంటే మీ ఖాందాన్ జైల్లో ఉండేది

మొదటి పేజీ తరువాయి..

సిద్ధమంటే చెప్పండి నిజ నిర్ధారణ కమిటీ వేద్దాం. ఫామ్ హౌస్ చుట్టూ కాలువలు తీసుకెళ్ళింది ఆధారాలు చూపాలా? ఇంకా ఎందుకు బుకాయిస్తున్నారు?

లగచర్లలో భూసేకరణలో బాధితులకు రూ.20 లక్షలు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్నాం. లగ చర్ల భూసేకరణ జరగకుండా మీరు అధికారులను చంపండి అని మీ మాజీ ఎమ్మెల్యే అక్కడి వాళ్లకి చెప్పింది నిజం కాదా? అధికారులను చంపాలని ప్రోత్సహించిన మీరు భూసేకరణ గురించి మాట్లాడుతున్నారా? ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో రూ.36 వేల కోట్ల నుంచి లక్షా 50 వేలకు పెంచింది మీరు. మీరు దిగిపోయే నాటికి కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్షా రెండు వేల కోట్లు బిల్లులు చెల్లించారు. మీరు ఫ్రాడ్ చేశారని కమిషన్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదికను వచ్చే సభలో పెడతాం.

బలవంతంగా భూములు గుంజుకుంది మీరు. మీరు తెలంగాణ జాతిపిత అని చెబుతున్న కెసీఆర్ ను కామారెడ్డి బండకేసి కొట్టారు. ప్రజలు తిరస్కరించినా ఇంకా ఎందుకు బుకాయిస్తున్నారు? మూసీ ప్రాజెక్టులు కట్టాలా వద్దా, మెట్రో రైలు నిర్మించాలా వద్దా, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించాలా వద్దా.. అభివృద్ధి చేయాలా వద్దా చెప్పండి? మేం అధికారంలోకి వచ్చాక దావోస్ పర్యటనలో రెండు లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చాం.

మాట్లాడితే ఇంగ్లీష్ గురించి మాట్లాడుతున్నారు. చైనా, జపాన్, జర్మనీ వాళ్లకు ఇంగ్లీష్ రాదు.. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్నాయి. నేను గుంటూరులో చదువుకోలేదు, ఆ తర్వాత పూణే వెళ్ళలేదు, అమెరికా వెళ్ళలేదు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న నేను ముఖ్యమంత్రిగా ఇక్కడకు వస్తే మీకు ఎందుకు అంత కడుపుమంట? వచ్చే ఐదేళ్లు కూడా ఇక్కడ మేమే ఉంటాం. మీరు అక్కడ ఉండాలనుకుంటే సలహాలు ఇవ్వండి.

నేపాల్ యువరాజు దీపేంద్ర అధికారం కోసం కుటుంబం మొత్తాన్ని ఏకే 47 తో కాల్చి చంపాడట. అలా మీరు పెద్దాయనను కూడా ఖతం చేసి కుర్చీలో కూర్చోవాలని చూడొద్దు. మీ తెలివితేటలు తెలంగా కోసం ఉపయోగించండి.

మేం నిజంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే, వాళ్లు అక్కడ కూర్చుని నోటికొచ్చినట్లు మాట్లాడేవారు కాదు. చంచలగూడ జైల్లో నో, చర్లపల్లి జైల్లోనో మమ్మల్ని పెట్టినచోటే ఉండేవారు. డ్రోన్ ఎగరేస్తే రూ. 500 ఫైన్ వేస్తారు. కానీ అధికారం అడ్డుపెట్టుకుని ఎంపీగా ఉన్న నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు.

16 రోజులు నన్ను డిటెన్షన్ సెల్లో ఒక మనిషి కూడా కనిపించకుండా, మమ్మల్ని నిర్బంధించిన ఆ కోపాన్ని బిగపట్టుకున్నాం తప్ప, కక్ష సాధింపునకు పాల్పడలేదు. లైట్లు ఆన్ లోనే పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా జైల్లో గడిపేలా చేశారు.కరుడు గట్టిన నేరస్తున్ని బంధించినట్లు ఒక పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న నన్ను బంధించారు. వాళ్ల తప్పులను దేవుడు చూస్తాడు. అంతకు అంత అనుభవిస్తారు అనుకుని ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రిపాలు చేశాడు.

చర్లపల్లి జైలు నుంచి నా బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా? అయినా నేను కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదు. నిజంగానే నేను కక్ష సాధించాలనుకుంటే మీ కుటుంబమంతా చర్లపల్లి జైల్లో ఉండేవారు. కానీ ఆ పని నేను చేయలేదు.మేం విజ్ఞత ప్రదర్శించాం. ప్రజలు అధికారం ఇచ్చింది నా కక్ష తీర్చుకోవడానికి కాదని నేను విజ్ఞత ప్రదర్శించా.

సొంతపార్టీ ఆఫీసులో బూతులు తీయించి రికార్డు చేయించినా, చెంపలు వాయించే శక్తి ఉన్నా నేను సంయమనం పాటించా. ఎవరివి కక్ష సాధింపు చర్యలో తెలంగాణ సమాజం ఇదంతా గమనిస్తోంది.

## వివేకా కేసులో అవినాష్‌ను ఇరికించడమే చంద్రబాబు లక్ష్యం

### వైయస్ జగన్‌ను ఇబ్బంది పెట్టడమే చంద్రబాబుకు ముఖ్యం

### అందుకే ఎల్లో మీడియాతో నిత్యం విషం చిమ్మే కథనాలు

### మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆగ్రహం

**వైయస్ఆర్ కడప జిల్లా:** వైయస్ వివేకానందరెడ్డి హత్యకేసులో కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డిని ఏదోఒకలా ఇరిగించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. వివేకాను హత్య చేసిన నిందితులు దస్తగిరి, సునీల్‌లు చంద్రబాబు చేతుల్లో కీలుబొమ్మలుగా మారి పోయారని ధ్వజమెత్తారు. ఈ కేసులో వైయస్ అవినాష్‌రెడ్డి నిందితుడని న్యాయస్థానం తీర్పు చెబితే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు.

వివేకానందరెడ్డి హత్య జరిగి ఆరేళ్లయినా టీవీ సీరియల్ మాదిరిగా తెలుగుదేశం పార్టీ దానిని తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూనే ఉంది. ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని తప్పుడు కథనాలు అచ్చేయిస్తూనే ఉంది. ఒకపక్క కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది, అయినా కూడా ఎల్లో మీడియా “అవినాశ్ డైరెక్షన్... పీఏ కృష్ణారెడ్డి యాక్షన్” అని రాస్తున్నారంటే చంద్రబాబు ఎంతగా రాజకీయ కక్షలతో ఉన్నారో అర్థమవుతోంది. ఈ ఘటనలో వైయస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేసే కుట్రల్లో భాగంగా పదే పదే ఎంపీ అవినాశ్ రెడ్డి మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. తద్వారా జగన్‌ని, వైయస్సార్సీపీని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనేదే వారి అసలు లక్ష్యం.

వివేకా రెండో వివాహం కోణంలో పోలీసులు విచారణ చేయడం లేదు. ముస్లిం యువతికి పుట్టిన బిడ్డ వివేకా కొడుకా? కాదా? అని డీఎన్ఏ టెస్టు ఎందుకు చేయలేదు? బెంగళూరులో రియల్ ఎస్టేట్ లావాదేవీలకు సంబంధించిన కోణంలో కూడా విచారణ చేయడం లేదు. ఎంతసేపటికీ అవినాశ్ చుట్టూ ఉచ్చు పన్నాలని ధ్యేయం తప్ప ఇంకోటి లేదు. జగన్‌ను ఎవరైనా అభిమానిస్తే వారిని ఏదో విధంగా వేధించడమే చంద్రబాబు లక్ష్యం. వివేకా హత్యకేసును అడ్డం పెట్టుకుని తెరవెనుక ఉండి చంద్ర బాబు ఆడించే ఆటలో సునీత పావుగా మారిపోయారు. ఆమె ద్వారా దస్తగిరి, సునీల్ కుమార్ కూడా చంద్రబాబు చెప్పిందల్లా చేస్తున్నారు. వివేకాను అత్యంత దారుణంగా నరికి చంపిన వ్యక్తులతో చంద్రబాబు అప్రూవర్‌గా మార్చి సెటిల్మెంట్లు చేయిస్తున్నారు. చంద్రబాబు ఆడే రాజకీయ క్రీడలో పావుగా మారి తండ్రిని చంపిన వ్యక్తులతో సునీతరెడ్డి చేతులు కలిపారు.

### దస్తగిరి, సునీల్ కుమార్‌లకు రూ.కోట్లు ఎలా వచ్చాయి?

వివేకా హత్యకు ముందు దస్తగిరి, సునీల్ కుమార్‌లు రూ. 500 కోసం కూడా చేయి చాపేవారు. అలాంటిది ఇప్పుడు కోట్లకు పడగలెత్తి జల్సాలు చేస్తున్నారంటే వారికి ఆ డబ్బులు ఎలా వచ్చాయి? తాము చెప్పిందల్లా చేసినందుకు, చెప్పిన మాటల్ని మీడియాలో మాట్లాడినందుకు సునీతరెడ్డి, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబులే వారికి డబ్బులిచ్చి పోషిస్తున్నారు. వారి తరఫున దేశంలోనే ఖరీదైన సుప్రీంకోర్ట్ న్యాయవాదులు హాజరై వాదనలు వినిపిస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు సొంతకేసులను వాదించిన సుప్రీంకోర్ట్ న్యాయవాదులే వీరిద్దరి కేసులను వాదిస్తున్నారంటే దీని వెనుక ఎవరి ప్రమేయం ఉందో అందరికీ అర్థమవుతోంది. సునీతరెడ్డి, చంద్రబాబు నాయుడు నిందితుల పక్షాన నిలబడి ప్రోత్సహిస్తున్నారు.


డిజిటల్ న్యూస్ పేపర్

శుక్రవారం 28, మార్చి 2025

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com




# మాటిచ్చినట్టే మంచి పాలన అందిస్తున్నాం

- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబుగారు

## 9 నెలల్లోనే అనేక హామీలు నెరవేర్చాం

- ✔ పింఛన్లు పెంచి రూ. 4 వేల నుండి 15 వేల వరకు ఇస్తున్నాం
- ✔ 204 అన్నక్యాంటీన్లు పునరుద్ధరించాం
- ✔ ఏడాదికి 3 ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం
- ✔ చెత్త పన్ను, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసాం



03

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 28, మార్చి 2025



# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికే 'డ్వాక్రా'!

- నారీమణులు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు
- అవకాశాలు ఇవ్వాలేకానీ అద్భుతాలు సృష్టిస్తారు
- అతివలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- ఎలీప్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన నారా భువనేశ్వరి

**కుప్పం, మహానాడు:** మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని, మహిళలకు అవకాశాలు ఇవ్వాలేకానీ అద్భుతాలు సృష్టిస్తారని నారా భువనేశ్వరి అన్నారు. మహిళలు వారి కాళ్లపై వారు నిలబడి ఆర్థికంగా బలోపేతం అవడం కోసమే సీఎం చంద్రబాబు డ్వాక్రా స్థాపించారని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. కుప్పంలో ఎలీప్ ఆధ్వర్యంలో మహిళలకు ఆరు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులను నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మాట్లాడారు.





## ఎలీప్ నా మనసు దోచుకుంది

మహిళల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన శిక్షణ అందించడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడంలో ఎలీప్ చేస్తున్న కృషి నా మనసును దోచుకుంది. రమాదేవి ఆమె టీం సభ్యులందరూ ఎలీప్ ద్వారా అనేకమంది మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దారు. అందుకోసం వారు హైదరాబాద్ లో ఇన్నాళ్లు చేసిన కృషి అమోఘం. అందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

## మహిళలు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

చంద్రబాబు హైదరాబాద్‌లో ఎలీప్ ఏర్పాటు చేశారు. ఎలీప్ నా కళ్ల ముందు పుట్టి ఎదిగింది. మహిళా పారిశ్రామిక వేత్తల కోసం కుప్పంలో ఎలీప్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా మహిళలు పారిశ్రామికవేత్తలుగా తయారై మరో పదిమందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకుంటారు. స్త్రీలు శక్తిమంతులు. మగవారిని మించి పనిచేయగలరు. నేను ఇది చేయలేను అనే భయం లేకుండా ముందడుగు వేయాలి. అప్పుడే అద్భుతాలు సాధించగలరు. సాధారణ గృహిణిగా ఉన్న నాకు చంద్రబాబు హెరిటేజ్ బాధ్యతలు అప్పగించారు. అన్నీ స్వయంగా నేర్చుకున్నాను.

ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మేం కూడా మహిళల ఆర్థిక స్వావలంబనకు పాటుపడుతున్నాం. వారి స్వయం ఉపాధికి చేయూత అందిస్తున్నాం. ఎలీప్ ఏర్పాటు విషయంపై ఐఏఎస్ అధికారి వికాస్ తో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాను. కుప్పం పరిధిలో పెద్ద పరిశ్రమలతో పాటు చిన్న తరహా పరిశ్రమలు కూడా రాబోతున్నాయి. వాటిలో పని చేయడం ద్వారా మహిళలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు.











# సీతక్క సరే..
## నీకెందుకు తెలుగురాదు అక్బర్?

- తెలుగు తెలియకుండా అసెంబ్లీలో ఏం మాట్లాడుతున్నారో నీకేం అర్థమవుతుంది?
- తెలుగురాకపోతే మీకు రాష్ట్రంలో ఏం సమస్యలు తెలుస్తాయి?
- ప్రసంగం దంచేసి వెళితే సరిపోతుందా? అంత పొగరైతే ఎలా?
- మజ్లిస్ నేత అక్బరుద్దీన్ ఒవైసీకి ఆకునూరి మురళి ఘాటు జవాబు

**హైదరాబాద్:** మంత్రి సీతక్కకు హిందీ రాదు. ఇంగ్లీషు తెలియదు. తనకు తెలుగు తెలయదంటూ మజ్లిస్ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి విరుచుకు పడ్డారు. 'ఇక్కడే పుట్టి పెరిగిన నీకెందుకు తెలుగు రాలేదు? తెలుగు నేర్చుకోవాలనే సామాజిక బాధ్యత లేదా? హిందీ, ఇంగ్లీషు రాకపోతే నీకెందుకు అంత చిన్నచూపు? పొగరు కాకపోతే..' అంటూ ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు.



"మంత్రి సీతక్క గారికి హిందీ రాదు సరే, మరి నీకు తెలుగు ఎందుకు రాదు బాబు? హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగినవు కదా? రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు మాట్లాడే మొదటి అధికార భాషా తెలుగు నేర్చుకోవాలనే సామాజిక బాధ్యత నీకు ఉండాలి కదా" అంటూ తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి.. మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీకి చురక అంటించారు. అసెంబ్లీలో అందరు సభ్యులు, మంత్రులు తెలుగులోనే మాట్లాడుతు న్నప్పుడు మీకు ఏం అర్థమవుతుందని ప్రశ్నించారు. ఏదో ఒకటి అసెంబ్లీలో ప్రసంగం దంచేసి వెళ్లిపోతే సరిపోతుందా? తెలుగు రాకపోతే రాష్ట్రంలోని సమస్యలు మీకెలా అర్థమవుతాయని ప్రశ్నించారు. హిందీ, ఇంగ్లీష్ రాకపోతే నీకు అంత చిన్నచూపా? పొగరు కాకపోతే! అంటూ ఆకునూరి మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి సీతక్కకు ఇంగ్లీష్, హిందీ రాదని, తనకు తెలుగు రాదని వ్యాఖ్యానించిన మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీకి.. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి 'ఎక్స్' వేదికగా కౌంటర్ ఇచ్చారు. మంత్రికి హిందీ రాదు సరే, హైదరాబాద్‌లోనే పుట్టిన మీకు తెలుగు ఎందుకు రాదని ప్రశ్నించారు.

# పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి

- దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 24 శాతం 19 శాతానికి పడిపోయే ప్రమాదం
- త్వరలోనే భట్టి విక్రమార్క, జానారెడ్డి ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో సమావేశం
- శాసనసభలో నియోజకవర్గాల పునర్విభజనపై శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన, నియోజకవర్గాల పెంపుపై చర్చ జరుపుతోంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం చెడిపోతుందని ఆనాడు ఇందిరా గాంధీ భావించారు. అందుకే చట్టాన్ని సవరించి పునర్విభజన చేశారు.

ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన అంశం మళ్లీ చర్చకు రావడంతో, దక్షిణాదిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగేలా కేంద్రం వ్యవహరిస్తే ఖచ్చితంగా మనం ఎదుర్కోవాలి. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేశాయి. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి.

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 24 శాతం 19 శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది. దక్షిణాది రాష్ట్రాలను నియంత్రించడానికి నియోజక వర్గాల పునర్విభజనను కేంద్రం వినియోగించుకుంటోంది. రాజకీయాలకు అతీతంగా దీనిపై ఒకే మాటపై నిలబడి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. అందుకే ఇవాళ సభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టాం.

ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణలో నియోజక వర్గాలను పునర్విభజన చేయాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మనపై వివక్ష చూపుతోంది. 2026 జనాభా లెక్కింపు తర్వాతే చేపడతామని ఆనాడు పార్లమెంట్ లో నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. జమ్మూ కాశ్మీర్ లో రాజ్యాంగాన్ని సవరించి 2011 జనభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను 83 నుంచి 90 కి పెంచారు.

సిక్కింలో 2018లో కేబినెట్ లో రిసొల్యూషన్ పాస్ చేసి, ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ప్రజల ముందుంచేందుకే సభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టాం. రాజకీయాలకు అతీతంగా పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిద్దాం. అవసరమైతే పోరాట బాట పడుదాం. త్వరలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో సమావేశం నిర్వహిస్తాం. ఈ సమావేశానికి అందరూ రావాలని విజ్ఞప్తి చేస్తున్నా.

# 'సూర్యలంక' అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.97.52 కోట్లు!

- స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 కింద రానున్న నిధులు
- బీచ్‌కు పట్టనున్న మహర్దశ
- ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ శాస్కి స్కీమ్ కింద అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులకు రూ.172.34 కోట్లు విడుదల
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చొరవ...
- కేంద్ర పథకాల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి రూ.269.86 కోట్ల నిధులు
- త్వరలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సూర్యలంక బీచ్ రూపురేఖలు
- ప్రతినబూనిన పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్
- నిధులు మంజూరు చేసినందుకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ కు ధన్యవాదాలు తెలిపిన మంత్రి
- పర్యాటకాభివృద్ధిని ప్రోత్సహిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎంలకూ కృతజ్ఞతలు
- పర్యాటకాంధ్రప్రదేశ్‌కు కృషి చేస్తోన్న పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారులను అభినందించిన మంత్రి దుర్గేష్





**రాజమహేంద్రవరం, మహానాడు:**

రాష్ట్రంలోని బాపట్ల జిల్లాలో ఉన్న సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 కింద రూ.97.52 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం లభించిందని మంత్రి కందుల దుర్గేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సూర్యలంక బీచ్ రూపురేఖలు మారుస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. త్వరలోనే సూర్యలంక ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, సరికొత్త హంగులతో పర్యాటకులకు దర్శనమివ్వబోతుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ప్రధానంగా సూర్యలంక బీచ్‌లో మౌలిక వసతుల కల్పన, బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచే అంశంపై దృష్టిసారించి అంతర్జాతీయ పర్యాట కులను ఆకర్షించే విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.

నిధుల వినియోగం విషయానికి వస్తే రూ.15.43 కోట్లతో సూర్యలంక బీచ్ లో పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభూతి కల్పన, రూ.4.37 కోట్లతో షాపింగ్ స్ట్రీట్ అభివృద్ధి, రూ. 7.76 కోట్లతో స్థిరమైన పర్యాటకాభివృద్ధి, పర్యాటకుల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం, రూ.11.69 కోట్లతో కెనాల్ ఎక్స్‌పీరియన్స్ డెవలప్ మెంట్, రూ.19.36 కోట్లతో సూర్యలంక ఎక్స్ పీరియన్స్ జోన్, రూ. 18 కోట్లతో ఇతర మౌలిక వసతులు కల్పించనున్నామన్నారు. అనంతరం బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ కోసం కృషి చేస్తామన్నారు. ఇప్పటికే సూర్యలంక బీచ్ అభివృద్ధి కోసం, పర్యాటకుల స్వర్గధామంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలతో కూడిన ప్రతిపాదనలు కేంద్రానికి పంపించామన్నారు.

ఇటీవల న్యూఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి సూర్యలంక బీచ్‌కు నిధులు ఇవ్వమని కోరానని అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఈ క్రమంలోనే ఇచ్చిన మాట ప్రకారం త్వరితగతిన నిధులు విడుదలకు ఆమోదం తెలిపినందుకు కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ కు మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా నూతన టూరిజం పాలసీ, పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పన తదితర వినూత్న నిర్ణయాలతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనునిత్యం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, అధికారులకు విలువైన సలహాలు, సూచనలు ఇస్తూ రాష్ట్ర పర్యాటక ప్రగతికి కృషి చేస్తున్న టూరిజం సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటకశాఖ అధికారులను మంత్రి దుర్గేష్ అభినందించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి మరిన్ని భారీ పర్యాటక ప్రాజెక్టులు వస్తాయని మంత్రి దుర్గేష్ అన్నారు. సమిష్టి కృషితో రాష్ట్రాన్ని పర్యాటకాంధ్రప్రదేశ్‌గా తయారు చేసుకుందామని అధికారులకు పిలుపునిచ్చారు.

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో చొరవతో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి రూ.269.86 కోట్లు నిధులు విడుదలయ్యాయి. అందులో భాగంగా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ శాస్కి స్కీమ్ కింద అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులకు రూ.172.34 కోట్లు మంజూరు కాగా సంబంధిత పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. తాజాగా బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్ కు రూ.97.52 కోట్ల విడుదలకు ఆమోదం లభించింది. పర్యాటక రంగానికి నిధుల వెల్లువతో రాష్ట్ర పర్యాటకానికి మంచి రోజులు వచ్చాయని పలువురు కొనియాడుతున్నారు.

# ఇక ఖాతాకు నలుగురు నామినీలు

- బ్యాంకింగ్ బిల్లుకు ఆమోదం.

ఇప్పటివరకు ఒక బ్యాంకు ఖాతాకు ఒకరే నామినీగా ఉండేవారు. ఇక నుంచి మనం గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా పెట్టుకోవచ్చు. ఇదే రూల్ బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)కు కూడా వర్తిస్తుంది. ఈమేరకు ప్రతిపాదనలతో కూడిన బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024పై పార్లమెంటు ఆమోద ముద్ర వేసింది. ఇవాళ రాజ్యసభలో ఈ బిల్లుకు మెజారిటీ ఓట్లు లభించాయి.



అంతకుముందు 2024 డిసెంబరులో ఈ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. లాకర్ల విషయానికి వస్తే.. వాటికి పాత పద్ధతిలోనే ఒకరికి మించి నామినీలను పెట్టుకోవచ్చు. అయితే వారికి ప్రయారిటీని నిర్ణయించుకోవాలి.

బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024లోని కీలక అంశాలు ఇలా ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరిధిలోని బ్యాంకులు ఇప్పటివరకు ప్రతీ రెండో శుక్రవారం, నాలుగో శుక్రవారంలలో ఆర్‌బీఐకు రిపోర్టింగ్ చేసేవి. అవి ఇక నుంచి ప్రతినెలా 15న, 30న రిపోర్టింగ్ చేయాలి. ప్రభుత్వం వద్ద నమోదైన కంపెనీలలోని డైరెక్టర్ల కనీస వాటా మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచారు. డైరెక్టర్ హోదాలో ఉన్నవారు కంపెనీలోని 10 శాతం ఈక్విటీని కలిగి ఉండొచ్చు.

సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీ కాలాన్ని ఎనిమిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టరుగా (Bank Account Nominees) ఉండేవారు, రాష్ట్ర సహకార బ్యాంకు బోర్డులోనూ సభ్యుడిగా వ్యవహరించొచ్చు. ఆడిటర్లకు వేతనాల చెల్లింపులో బ్యాంకులకు స్వేచ్ఛను కల్పించే నిబంధన సైతం సవరించిన చట్టంలో ఉంది.

## రుణాల ఎగవేతదారులపై కఠిన చర్యలు

ఉద్దేశపూర్వకంగా బ్యాంకుల అప్పులను ఎగ్గొట్టే వాళ్లను వదిలేది లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తేల్చి చెప్పారు. వాళ్ల నుంచి అప్పులను వసూలు చేసేందుకు బ్యాంకులు తగిన చర్యలు చేపడతాయని స్పష్టం చేశారు. బ్యాంకుల అప్పులను 'రైట్ ఆఫ్' చేయడం అంటే మాఫీ చేసినట్టు కాదన్నారు. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024పై రాజ్యసభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ నిర్మల ఈ వివరాలను వెల్లడించారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
4
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 28, మార్చి 2025 ‖




## ఏనుపాలెంలోని అత్యాచారం, హత్య కేసుపై నిర్లక్ష్యం!

- 10 నెలలు దాటినా నిందితులను పట్టుకోలేని పోలీసులు
- టీడీపీ గ్రీవెన్స్‌లో ఓ మాతృమూర్తి ఫిర్యాదు
- టీడీపీ కార్యకర్త ఇంటిపైకి వైసీపీ నేతలు దాడి.. ఆ వీడియో చిత్రీకరించినందుకు అక్రమ కేసు
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ

**మంగళగిరి, మహానాడు:** పల్నాడు జిల్లా, వినుకొండ మండలం ఏనుపాలెం గ్రామంలో తన కూతురిపై సామూహిక అత్యాచారం చేసి చంపి కాలువలో పడేశారని.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి పది నెలలు అయినా ఇంకా దోషులను పట్టుకోలేదని.. దయ చేసి త్వరగా పోలీసులు విచారణ జరిపి దోషులకు కఠిన శిక్షపడేలా చేసి తన కూతురు మరణానికి శాంతికలిగేలా చూడాలని కాకినాడ జిల్లా జగన్నాథపురం గ్రామానికి చెందిన పి.మంగమ్మ విన్నవించారు. ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్





లో ఆమె ఫిర్యాదు చేశారు. ఈ అర్జీతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీలను నేతలు లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

- టీడీపీ కార్యకర్త ఇంటిమీదకు వైసీపీ నాయకులు రాడ్లు, బ్యాట్లు తీసుకొని దాడికి వస్తుంటే.. తాను వీడియో తీసి పోలీసులకు ఇచ్చినందుకు తనను ప్రథమ నిందితునిగా చేర్చి అసలు గొడవకు కారకులైన వైసీపీ నేతలను గుత్తి సీఐ వెంకట్రామిరెడ్డి నాడు వదిలేశారని.. అతనిపై చర్యలు తీసుకొని తన మీదపెట్టిన అక్రమ కేసును తొలగించాలని అనంతపురం జిల్లా గుంతకల్ మండలం తొండపాడు గ్రామానికి చెందిన సి. సత్యనారాయణ నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.
- కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంకు చెందిన దుర్గాప్రసాద్ రావు విజ్ఞప్తి చేస్తూ.. 2016-2017లో ఎమ్జీఎన్ఆర్ ఈజీఎస్ కింద తమ గ్రామంలో అంగన్వాడీ భవనం నిర్మించానని.. దానికి ఇప్పటికి బిల్లు రాక ఇబ్బంది పడుతున్నానని.. దయ చేసి తనకు రావాల్సిన బిల్లు వెంటనే వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.
- కాకినాడ జిల్లా, కిర్లంపూడి మండలం చిల్లంకి గ్రామానికి చెందిన నాగేంద్రకుమార్ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో ఉన్న వరద కాల్వను ఆక్రమించుకోవడం వలన వరదల సమయంలో పక్కనే ఉన్న పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయని.. అంతే కాకుండా తమ పొలం కూడా పూర్తిగా ముంపునకు గురవుతుందని.. దయ చేసి కాల్వపై ఆక్రమణలను తొలగించాలని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.
- కడప జిల్లా, కడప టౌన్‌కు చెందిన పడదుర్తి రామ మోహన్ ఆచారి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ... మజ్జారి రామకృష్ణ అనే వ్యక్తి వద్ద పొలం కొనుగోలు కోసం కోటి 45 లక్షలు చెల్లించాక.. ఇంట్లో తలెత్తిన సమస్యల కారణంగా మిగిలిన డబ్బులు కట్టలేకపోయామని.. దానికి వారి వద్దకు వెళ్లి విషయం చెప్పి తాము కట్టిన డబ్బులకు ఎంత భూమి వస్తే అంత రిజిస్ట్రేషన్ చేయమని అడగ్గా.. వారు అందుకు అంగీకరించకపోగా.. తిరిగి తమపైన దాడి చేసి బలవంతంగా సంతకాలుపెట్టించుకొని ఆ పొలంలో అక్రమ లేఅవుట్‌లు వేసి విక్రయించారని.. దీనిపై విచారించి తమకు న్యాయం జరిగేలా చూడాలని నేతలకు అర్జీ ఇచ్చి వాపోయాడు.
- తమ బిడ్డలు విదేశాల్లో చదువుల కోసం వెళ్లారని.. వారి చదువులకు విదేశీ విద్య సాయంను అందించి ఆదుకోవాలని తోట రమాదేవి, శ్రీనివాసరావు తదితరులు విజ్ఞప్తి చేశారు.
- కృష్ణా జిల్లా, పెనమలూరికి చెందిన ఓ వివాహిత విజ్ఞప్తి చేస్తూ.. తనను మోసం చేసి పెళ్లి చేసుకోవడమే కాకుండా.. పెళ్లి అయిన పదిరోజులకే తనను తన పుటింట్లో వదిలేసి తన భర్త, అత్త, కుటుంబ సభ్యులు అసలు పట్టించుకోవడంలేదని.. వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె గ్రీవెన్స్ లో వేడుకుంది.

## అధిక సభ్యత్వాలతోనే టీడీపీ బలోపేతం

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

**సాలూరు, మహానాడు:** సాలూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు మరింత ఉత్సాహాన్ని అందించేందుకు 40,000 మంది సభ్యత్వాల నమోదు కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిన సందర్భంగా, సభ్యత్వ



కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాం. ఈ కార్యక్రమం పార్టీ బలోపేతానికి కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశిస్తున్నాను అని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సభ్యత్వ పెంపును మాత్రమే కాకుండా, సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తను పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయికి ప్రతి కార్యకర్త అభివృద్ధి చెందేలా పార్టీ ప్రణాళికలను అమలు చేయబోతున్నాం అని వెల్లడించారు. ఇంకా, ఆమె ఏమన్నారంటే..

పార్టీకి ఇంకా ఎక్కువ మంది ప్రజలను ఆకర్షించేందుకు ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు చేపట్టడం. పార్టీలో చేరిన కొత్త సభ్యులకు పార్టీ విధానాలు, ప్రభుత్వ పథకాలు, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, స్థానిక స్థాయిలో పరిష్కారం కల్పించేందుకు కృషి చేయడం. ఈ కార్యక్రమం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు చేరువ కావడం, సభ్యత్వాన్ని ఉపయోగించి పార్టీకి మరింత ప్రోత్సాహాన్ని అందించడం మా లక్ష్యం. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్.పి. బంజుదేవ్, రాష్ట్ర కార్యదర్శి మూకీ సూర్యనారాయణ, సాలూరు టౌన్ పార్టీ అధ్యక్షుడు నిమ్మడి తిరుపతిరావు, సాలూరు మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేష్, మక్కువ మండల పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు, పాచిపెంట మండలం ప్రధాన కార్యదర్శి గూడెపు యుగంధర్ పాల్గొన్నారు. అలాగే క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు, అనేక మంది పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జీవో 70.. లిడ్ క్యాప్‌కు ఆర్థిక బలం!

- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన లిడ్ క్యాప్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు

**అమరావతి, మహానాడు:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో ఆర్టీ నెం.70ను రిలీజ్ చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ జీవో ప్రకారం రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, పంచాయతీలకు కావాల్సిన లెదర్ ఉత్పత్తులను ముఖ్యంగా పాదరక్షలు, బెల్టులు, అన్ని రకాల లెదర్ సంబంధిత ఉపకరణాలను లిడ్ క్యాప్ నుండే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన ఈ జీవో వలన లెదర్ పరిశ్రమకు బాగా ఉపయోగపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. పరిశ్రమల్లోని కార్మికులకు జీవనోపాధి మెరుగుపడు తుంది. లెదర్ పరిశ్రమల అభివృద్ధికి ఉపకరిస్తుంది. లిడ్ క్యాప్ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈ జీవో బలాన్ని సమకూర్చిందన్నారు.

సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ ఎం.ఎం



నాయక్, లిడ్ క్యాప్ ఎండి ప్రసన్న వెంకటేశ్ లకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. లిడ్ క్యాప్‌కు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంస్థ పురోగతికి నిరంతరం పనిచేస్తామని చైర్మన్ తెలిపారు.

## ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తున్న పాలన

- అధికారం మూర్తీభవించిన అహంకారంతో రేవంత్ రెడ్డి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్:** రేవంత్ రెడ్డి వ్యవహారం నవ్వి పోదురుగాక నాకేంటి సిగ్గు అన్నట్లు ఉంది. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రూ.28,817 కోట్లు రుణ మాఫీ చేసింది. 11 విడతల్లో రూ.73 వేల కోట్లు రైతుబంధు ఇచ్చింది. ఏడాదికి రూ.10,500 కోట్లతో వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరంటు అందజేశాం. వివిధ కారణాలతో మరణించిన లక్ష 11 వేల రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రైతుబీమాతో అండగా నిలిచింది.



24 గంటల ఉచిత కరెంటు అవసరం లేదని నిస్సిగ్గుగా వ్యతిరేకించింది కాంగ్రెస్. 3 గంటల కరంటు చాలు, 10 హెచ్ పీ మోటార్ పెడితే గంటకు ఎకరా తడుస్తుంది అని చెప్పింది రేవంత్ రెడ్డి. డిసెంబర్ 9 న రూ.2 లక్షల వరకు రుణమాఫీ, డిసెంబర్ 9న ప్రతి ఎకరాకు రూ.7500 చొప్పున రైతుభరోసా, డిసెంబర్ 9న ప్రతి ఆడబిడ్డకు మహాలక్ష్మి పథకం కింద రూ.2500, డిసెంబర్ 9న ప్రతి దివ్యాంగునికి రూ.6 వేలు ఫించను, డిసెంబర్ 9న ప్రతి అవ్వా,తాతకు, ఒంటరి మహిళకు, వితంతువులకు రూ.4 వేల ఫించన్ అని చెప్పింది కాంగ్రెస్, రేవంత్ రెడ్డి. 15 నెలల పాలనలో రెండు సార్లు రైతుభరోసా ఎగ్గొట్టి, రూ.15 వేల రైతుభరోసా రూ.12 వేలకు కుదించి కనీసం మూడెకరాల వరకు రైతులకు కూడా రైతుభరోసా ఇవ్వకుండా, అరకొర రుణమాఫీ చేసి, అసలు ఫించను ఒక్క రూపాయి పెంచకుండా, రూ.2500 మహాలక్ష్మి పథకం అసలు అమలు చేయకుండా, సాగునీళ్లను ఎగ్గొట్టి, పంట కొనుగోళ్లను పక్కనపెట్టి, క్వింటాలుకు బోనస్ రూ.500 ఎగ్గొట్టి, రైతుబీమాకు ప్రీమియం కట్టకుండా , రాష్ట్ర ఖజానా కొల్లగొట్టి నిర్లజ్జగా ఉల్టా చోర్ కొత్వాల్ కు డాంటే అన్నట్లు రేవంత్ రెడ్డి మాట్లాడడం సిగ్గు చేటు..

ఇది ప్రజాపాలన కాదు. ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తున్న పాలన. అధికారం ఉందని ప్రజల ఆకాంక్షలు, ఆశలను అవహేళన చేస్తున్న పాలన. పదేళ్ల బీఆర్ఎస్ పాలన మీద దుష్ప్రచారం చేసింది స్వయం ప్రకటిత మేధావులు, వ్యక్తిగత ప్రయోజనాలు, పదవులు దక్కనివారు. పదిహేను నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నది పదేళ్ల కేసీఆర్ పాలనలో దక్కిన నీళ్లు, నిధులు, పథకాలు, సంక్షేమాన్ని కోల్పోయిన సామాన్య ప్రజలు.

అధికారంతో మూర్తీభవించిన అహంకారంతో, రేవంత్ రెడ్డి మీడియా మేనేజ్‌మెంట్‌తో వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించ గలనని భావిస్తున్నాడు. ఒక్కసారి మోసపోయిన చైతన్యవంతమైన తెలంగాణ సమాజం మళ్లీ, మళ్లీ మోసపోదు. సమయం వచ్చినప్పుడు సమాధానం చెప్పేందుకు ఎదురుచూస్తున్నది

## 2047 నాటికి మురికివాడల రహిత ఆంధ్రాయే కూటమి లక్ష్యం

- విజన్ 2047 పదిసూత్రాల అమలుతో అన్ని రంగాలు ముందజ ఖాయం
- ముఖ్యమంత్రి విజన్ కు అనుగుణంగా ప్రణాళికలు
- అర్బన్ డెవలప్ మెంట్ కు కేంద్రం బడ్జెట్ లో నిధులు కేటాయించడం హర్షణీయం
- పట్టణాల అభివృద్ధికి ప్లానర్‌లు, ఆర్కిటెక్ట్‌లు తమ వంతు సహకారం అవశ్యం
- మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ



**విజయవాడ, మహానాడు:** ఆంధ్రా 2047 నాటికి మురికివాడల రహితంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణా భివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. స్వర్ణాంధ్ర 2047పై నేషనల్ కాన్ఫరెన్స్ లో భాగంగా ఒక రోజు వర్క్ షాపును స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. విజన్ 2047లో పది సూత్రాల అమలుతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలపాల న్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. 2047 నాటికి దేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోనుందని, ఆ సమయానికి మన రాష్ట్రాన్ని సమగ్రమైన, సమతుల్యమైన అభివృద్ధికి నమూనాగా రూపొందిస్తామన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని సీఎం చంద్రబాబు విజన్ 2047 ను రూపొందించారని పేర్కొన్నారు. విజన్ 2047 లో కీలక అంశంగా అమరావతి కూడా ఉందన్నారు. అమరావతిని కేవలం మౌలిక వసతుల ప్రాజెక్ట్ మాత్రమే కాకుండా నాణ్యమైన జీవన ప్రమాణాలు కలిగి ఉండేలా డిజైన్ చేశామని చెప్పారు. పట్టణాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అర్బన్ డెవలప్మెంట్‌కు నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతో రాష్ట్రంలో పట్టణాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నా మన్నారు. ఆర్థిక వనరుల వినియోగం ద్వారా పట్టణాల అభివృద్ధికి ప్లానర్ లు, ఆర్కిటెక్ట్‌లు తమ వంతు సహకారం అందించాలని కోరారు.

20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ వ్యూహాత్మక పెట్టుబడులు, సహకారం ద్వారా స్థిరమైన పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల వృద్ధి, ఆర్థిక స్థితిస్థాపకతపై ప్రాధాన్యత ఉంటుందన్నారు. భారత దేశంలోనే ఏపీని ఒక ప్రముఖ రాష్ట్రంగా తీర్చిదిద్దటానికి ఒక రోడ్ మ్యాప్ ను రూపొందిస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పనికి ఒక ప్రణాళిక అవసరమని, ఒక్క రోజులో అద్భుతాలు జరగవని, రాష్ట్రాన్ని దేశంలోనే ప్రత్యేక గుర్తింపు రాష్ట్రంగా తీర్చిదిద్దటానికి పక్కా ప్రణాళిక అవసరమని అభిప్రాయపడ్డారు. ఆ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. నిత్య కృషి ఉత్తమ ఫలితాలను ఇస్తుందని తెలిపారు. మన దేశంలో ప్లానింగ్ సిటీలు లేవన్నారు. ఇప్పటికీ వరదల సమయంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొం టున్నామని, కాని అమరావతిని ఒక ప్లానింగ్ సిటీగా రూపొందిస్తు న్నామన్నారు. క్లీన్, గ్రీన్ సిటీగా అమరావతి నిలవనుందన్నారు.

అనంతరం నిపుణులు నీతి అయోగ్, ఆర్థిక సలహా, ప్రజా విధానం, పట్టణ పాలన, పట్టణ ప్రణాళిక తదితర అంశాలపై తమ విలువైన సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో టీసీపీవో చీఫ్ ప్లానర్ ఎన్. ధీరేన్, డాక్టర్ అమోఘ్ కుమార్ గుప్తా, డాక్టర్ రమేష్ శ్రీకొండ తదితరులు పాల్గొన్నారు.



## పల్లె పల్లెలో ‘నిఘా’ నేత్రాలు!

- సీసీ కెమెరాల పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం
- త్వరలో పాయకరావుపేటలోనూ అమలు
- పోక్సో చట్టంపై ‘స్టాటిస్టిక్స్ ఆఫ్ షేమ్’ పుస్తకం ఆవిష్కరణ
- అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ సంఘటలకు చెక్
- నేరాల నియంత్రణలో ప్రతి పౌరుడిది బాధ్యతే
- ఇకపై ఇంట్లో కనీస అవసరాల్లో ఒకటిగా సీసీ కెమెరా
- ఫోన్‌కి స్క్రీన్ గార్డ్ సరే.. విలువైన ప్రాణం మాటేమిటి?
- విజయనగరంలో డ్రోన్ ఎగరేసి..పేకాటరాయుళ్లను పట్టుకున్నాం
- జగ్గయ్యపేటలో సీసీ టీవీల ప్రారంభోత్సవానంతరం హెూంమంత్రి అనిత

**అమరావతి, మహానాడు:** విజయనగరంలో ఇటీవల డ్రోన్‌ను ఎగరేసి పేకాటరాయుళ్లను పట్టుకున్నామని హెూంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి ఆటలు ఇకమీదట సాగనివ్వబోమని టెక్నాలజీ ద్వారా ఆట కట్టిస్తామని ఆమె హెచ్చరించారు. ఇన్విజిబుల్ పోలిసింగ్‌కు ఈ ఘటనను నిదర్శనంగా హెూంమంత్రి పేర్కొన్నారు. జగ్గయ్యపేటలో సీసీ కెమెరాల ఏర్పాటు పైలట్ ప్రాజెక్ట్‌ను హెూం మంత్రి అనిత గురువారం ప్రారంభించారు. కొత్తగా 509 సీసీల ఏర్పాటుతో నేరాల నియంత్రణలో జగ్గయ్యపేట సర్కిల్ నమూనాగా నిలుస్తుందన్నారు. త్వరలోనే సొంత నియోజక వర్గమైన పాయకరావుపేటలోనూ ఈ ప్రాజెక్టును అమలు చేస్తామని హెూంమంత్రి స్పష్టం చేశారు.



జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య చొరవను హెూంమంత్రి అభినందించారు. సీసీ టీవీల ఏర్పాటుకు కృషి చేస్తోన్న సీపీ రాజశేఖర్ బాబు నేతృత్వంలోని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ప్రశంసించారు. జగ్గయ్యపేటలోని 71 గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలకు ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రక్షిస్తామని చెప్పారు.



### ప్రతి ఇంటికి సీసీ కెమెరా అనివార్యం : హెూంమంత్రి అనిత

గత ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థను వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని హెూంమంత్రి అనిత విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నేరస్తులు ఎక్కడికక్కడ చెల్లాచెదు రవుతున్నారన్నారు. కొన్నిరోజుల కిందటే ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో 1000సీసీ కెమెరాలు, 28 డ్రోన్ లు ఏర్పాటు చేశామన్నారు. టీవీ, ఫ్రిడ్జి, ఏసీలతో పాటు ప్రతి ఇంట్లో సీసీ కెమెరా కూడా కచ్చితంగా ఉండాలన్నారు. మద్యం, డ్రగ్స్, గంజాయి, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. శక్తి యాప్ , శక్తి టీంలు మహిళలను రక్షిస్తాయన్నారు. పోక్సో యాక్ట్‌తో పాటు తప్పు చేస్తే శిక్షపడే చట్టాలకు ప్రచారం కల్పిస్తామన్నారు. నేర నియంత్రణలో ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు.

### పోక్సో చట్టానికి సంబంధించిన ‘స్టాటిస్టిక్స్ ఆఫ్ షేమ్’ పుస్తకావిష్కరణ

హెల్మెట్ లేదని పోలీసులు పట్టుకుంటే నేరుగా ఎమ్మెల్యేలకు ఫోన్ చేసే పరిస్థితి వాహనదారులకు మంచిది కాదని హెూంమంత్రి అభిప్రాయ పడ్డారు. ఫోన్‌కి స్క్రీన్ గార్డు వేయిస్తారు..విలువైన ప్రాణాన్ని రక్షించే హెల్మెట్ పెట్టుకోరా? అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. హెల్మెట్ లపై జరిమానాలు కేంద్ర ప్రభుత్వం నిర్ణయమన్నారు. హెల్మెట్ వినియోగిస్తే జరిమానా కట్టనవసరం లేదు.. ప్రమాదంబారిన పడాల్సిన అవకాశం ఉండదన్నారు. పోక్సో చట్టానికి సంబంధించిన ‘స్టాటిస్టిక్స్ ఆఫ్ షేమ్’ పుస్తకాన్ని హెూంమంత్రి ఆవిష్కరించారు. పుస్తకం కోసం కృషి చేసిన పోలీసు ఉన్నతాధికారులకు హెూంమంత్రి ప్రశంసా పత్రాలను అందజేశారు. హెల్మెట్ వినియోగం మన ప్రాణాల్ని రక్షించ డానికేనని యువత అర్థం చేసుకోవాలన్నారు. పోక్సో కేసుల్లో బాధితులు, నిందితులంతా నిరక్షరాస్యులే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, డీసీపీలు గౌతమి, సరిత, ఉదయరాణి, సురక్ష కమిటీ కన్వీనర్ నర్సయ్య, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, జగ్గయ్యపేట ప్రజలు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

5

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, మార్చి 2025





## బొగ్గు బ్లాకుల వేలం ద్వారా రూ.40,960 కోట్లు పెట్టుబడులు

- ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- ఖనిజ, బొగ్గు రంగానికి సంబంధించి విజనరీ రోడ్ మ్యాప్
- తాజ్ హోటల్‌లో జరిగిన 12వ కోల్ బ్లాక్ వేలం కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి



**ఢిల్లీ:** బొగ్గు ఉత్పత్తిలో 1 బిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకున్న చరిత్రాత్మక సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈ ఏడాదితో కోలిండియా 50వ వసంతంలోకి, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 175వ వసంతంలోకి అడుగు పెట్టిన మరో అద్భుత ఘట్టాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నాం. ఈ విజయాలన్నీ గత పదేళ్లలో తీసుకున్న అద్భుతమైన పాలసీలు, సమష్టి కృషి కారణంగానే సఫలమైంది.

ఒకప్పుడు అవినీతి, కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న బొగ్గు రంగం.. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అధునాతనంగా, పారదర్శకంగా మారి కొత్త పుంతలు తొక్కుతోంది. 2015లో వేలం ప్రక్రియను అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత ప్రైవేటు రంగం భాగస్వామ్యం, నూతన సాంకేతికత సాయంతో ఈ రంగం ముఖ చిత్రమే మారిపోయింది. ఇప్పటివరకు 125 బొగ్గు బ్లాకులను 11 దశల్లో విజయవంతంగా వేలం వేశాం. వీటిలో ప్రైవేటు రంగం కూడా భాగస్వామ్యం అయింది. ఈ వేలం ద్వారా ఏకంగా రూ.40,960 కోట్లు పెట్టుబడులు వస్తాయి. అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయి. ఇవాళ 12వ ట్రాంచేలో భాగంగా 28 బొగ్గు, లిగ్నయిట్ బ్లాకులకు వేలం నిర్వహించాం. ఈ వేలం ప్రక్రియ ద్వారా బొగ్గు దిగుమతులు తగ్గడమే కాకుండా, విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడి, ఆత్మనిర్భర భారత్‌కు అసలైన నిర్వచనం ఇస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఉద్యోగాల కల్పన, సరుకు రవాణాకు ఈ రంగం ఊపిరులూదుతోంది. దీంతో జాతీయ ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది. వేలం ప్రక్రియ ద్వారా ప్రైవేటు రంగ సంస్థలతో ప్రభుత్వ రంగ సంస్థలు పోటీ పడుతున్నాయి. దీంతో PSUల సమర్థత కూడా పెరుగుతోంది. ఇది ప్రపంచవ్యాప్తంగా పోటీ పడేందుకు దోహదపడుతుంది.

మహాకుంభ మేళా సందర్భంగా ఎన్ని అవాంతరాలు ఏర్పడినా బొగ్గు రంగం.. నిరంతరం శ్రమించి, దేశవ్యాప్తంగా బొగ్గు సరఫరా చేసి, అన్ని రంగాల విద్యుత్ అవసరాలను తీర్చింది. ఇప్పటికి కూడా దేశ వ్యాప్తంగా ఉత్పత్తి, స్టీలు రంగాల 72 శాతం విద్యుత్ అవసరాలను బొగ్గు తీరుస్తోంది. ఈ నేపథ్యంలో పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా సుస్థిర లక్ష్యాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

2025 కేంద్ర బడ్జెట్‌లో దేశ ఖనిజ, బొగ్గు రంగానికి సంబంధించి విజనరీ రోడ్ మ్యాప్ రూపొందించాం. వ్యాపార అవకాశాలు, సృజనాత్మకత పెంపొందించేందుకు, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు మైనింగ్, బొగ్గు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్, గనులను సొంతం చేసుకున్న వారి కోసం ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్, గనులకు స్టార్ రేటింగ్ వ్యవస్థ కూడా తీసుకొచ్చాం.

2030 నాటికి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా కోల్ గ్యాసిఫికేషన్ ప్రోగ్రామ్ తీసుకొచ్చాం. కోల్, లిగ్నయిట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు రూ.8 వేల కోట్లతో ఇన్సెంటివ్ స్కీం తీసుకొచ్చాం. సుస్థిరమైన మైనింగ్ కార్యకలాపాలు చేపట్టేందుకు నూతన విధానాలు అవలంబిస్తూ, నూతన సాంకేతికతలను వినియోగిస్తున్నాం. గత పదేళ్లలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా వేలం ప్రక్రియలో తొలిసారిగా బిడ్డింగ్ వేసిన 5 కంపెనీలు గనులను సొంతం చేసుకున్నాయి. అయితే గనులను సొంతం చేసుకున్న సంస్థలు త్వరితగతిన మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించడం చాలా కీలకం. మైనింగ్ ప్రక్రియ వేగవంతంగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుంది. అనుమతుల ప్రక్రియ సజావుగా, వేగంగా జరిగేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాం.

బొగ్గు గనుల్లో పెట్టుబడులు పెట్టడమంటే భారతదేశ ఎనర్జీ భవిష్యత్తు, ఆర్థిక వృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యోగ కల్పనలో పెట్టుబడులు పెట్టడమేనన్న విషయాన్ని గుర్తు పెట్టుకుని ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలని కోరుతున్నాను.

## చెప్పిన మాటలను చేతల్లో చూపించిన రేవంత్ రెడ్డి

- హైదరాబాద్ సమావేశం నేపథ్యంలో అదే బాటలో మరిన్ని రాష్ట్రాలు
- పునర్విభజనపై తెలంగాణ అసెంబ్లీ తీర్మానంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్



**చెన్నై:** నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ శాసనసభలో ఒక ముఖ్యమైన మైలురాయిలా నిలిచిపోయే తీర్మానం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటలను చేతల్లో నిరూపించారని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కొనియాడారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన తెలంగాణ శాసన సభ గురువారం తీర్మానం చేసిన నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి X (ట్విట్టర్) వేదికగా స్పందించారు.

న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని సమర్థిస్తూ సరైన రీతిలో పునర్విభజన కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశారని తమిళనాడు సీఎం పేర్కొన్నారు. చెన్నైలో ప్రతిపాదించిన అంశాలు హైదరాబాద్‌లో నెరవేరాయని, ఇది ఆరంభం మాత్రమేనని.. హైదరాబాద్‌లో ఐక్యకార్యాచరణ సమితి రెండో సమావేశం నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు అదే బాటలో నడుస్తాయని తమిళనాడు సీఎం అభిప్రాయపడ్డారు.

పునర్విభజన విషయంలో తమిళనాడును అనుసరిస్తూ, ఈ చర్య మన ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించే సమష్టితత్వాన్ని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ భవిష్యత్తును అధర్మ మార్గాన ఒక ప్రాంతానికి అన్యాయం చేసే రీతిన రాసేందుకు ప్రయత్నించే ఎవరినీ అనుమతించబోమనిస్టాలిన్ స్పష్టం చేశారు.

## ఆంధ్రాకు అయిదేళ్ల తర్వాత
# స్వాతంత్ర్యం లభించింది

- ఎన్డీఏ పాలనలో ప్రజలందరికీ మంచే జరుగుతుంది
- మహిళలు ఆర్థికంగా బలంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయం
- 2వ రోజు 'కుప్పం' పర్యటనలో నారా భువనేశ్వరి వెల్లడి

**కుప్పం, మహానాడు:** ఏపీ ప్రజలకు మళ్లీ ఐదేళ్ల తర్వాత స్వాతంత్ర్యం లభించిందని, కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు పాలనా సామర్థ్యం గురించి రాష్ట్ర ప్రజలకు తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పారిశ్రామిక వేత్తలు ఏపీలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారంటే అందుకు చంద్రబాబుపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. రెండో రోజు కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మోడల్ కాలనీ, కృష్ణదాసపల్లి, జరుగు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు.







గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. మహిళలు తమపై తాము నమ్మకం పెట్టుకుని ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు.

### అందరికీ సంక్షేమం

ఎన్నికల్లో గెలుపు కోసం కొందరు సాధ్యం కాని హామీలు ఇస్తారు. కానీ చంద్రబాబు చెప్పారంటే చేతల్లో చేసి చూపిస్తారు. ప్రజలు కాస్త ఓపిక పట్టాలి. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయి. ఒక ఇండస్ట్రీ తీసుకురావాలంటే అంత ఆషామాషీ కాదు. 2019 తర్వాత చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఏపీ నిలిచేది. పోలవరం పూర్తయ్యేది. రాష్ట్రాన్న చంద్రబాబు నిలబెడతారు. రాష్ట్రమంతటా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు సహా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ నీటి సమస్య తీర్చేందుకు వీలైనంత త్వరగా హంద్రీనీవా పూర్తిచేసి అందరికీ నీరు అందిస్తారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఏం చేసిందో ప్రజలు,





పారిశ్రామివేత్తలకు తెలుసు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపారు.

### డ్వాక్రాతో మహిళల జీవితాల్లో వెలుగులు

ఇక్కడికి వచ్చిన మహిళలందరికీ ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు. మహిళలు ఒకసారి చెబితే చాలు చక్కగా వింటారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు ఉండబట్టే కుటుంబాన్ని తీర్చిదిద్దుతున్నారు. మహిళల కోసం సీఎం చంద్రబాబు అనేక పథకాలు అమలు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో మగవారిని మించి విజయాలు సాధించాలని చంద్రబాబు కోరుకుంటూ ఉంటారు. మహిళలు డబ్బు కోసం ఇబ్బంది పడకూడదని, వారు ఆర్థికంగా బలంగా ఉండాలనే ఉద్దేశంతోనే డ్వాక్రా సంఘాలు స్థాపించారు. ఒకప్పుడు వందా, రెండు వందల కోసం ఇతరులపై ఆధార పడిన స్త్రీలు నేడు బ్యాంకు లావాదేవీలు స్వయంగా చూసుకునే స్థాయికి చేరారంటే అది చంద్రబాబు తీసుకొచ్చిన డ్వాక్రాతోనే సాధ్యమైంది.

మగవాళ్లతో సమానంగా ఉద్యోగాలు చేస్తూనే ఇంటి బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువులు చూసుకుంటున్నారు. వ్యాపారంలోకి రాకముందు నేను ఇంటి నుంచి బయటకు రావాలంటేనే సిగ్గుపడేదాన్ని. వచ్చాక నేను ఏమైనా చేయగలను అనే ధైర్యం బిజినెస్‌లోకి అడుగుపెట్టాకే వచ్చింది. మీ గౌరవం కోసం మీరు పనిచేయండి. మహిళలు తమ సంపాదనను ముందుగా వారి అవసరాలకు వినియోగించు కోవాలని నారా భువనేశ్వరి అన్నారు.

## మా పథకాలను కేంద్రం కాపీ కొట్టింది

- పన్నుల రూపంలో తీసుకుంటూ మనకు మాత్రం తిరిగి ఏమీ ఇవ్వడం లేదు
- పదేండ్లుగా తెలంగాణకు కేంద్రం దగా
- కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడిన కెటిఆర్
- హైకోర్టు ఎన్నిసార్లు తిట్టినా హైడ్రా తీరు మారడం లేదు
- శాసన సభలో ద్రవ్యవినియమ బిల్లుపై కెటిఆర్ ప్రసంగం: కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్:** శాసనసభలో ద్రవ్యవినియమ బిల్లుపై ప్రసంగించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. 2014 నుంచి తెలంగాణ పట్ల అనుసరిస్తున్న వివక్ష పై విమర్శలు గుండెల్ని తాకేలా ఉన్నాయి. ఏర్పడిన దశాబ్ద కాలంలోనే అభివృద్ధిలో మెరుపు వేగంతో దూసుకుపోయిన రాష్ట్రం తెలంగాణ అని ఆయన గర్వంగా చెప్పారు. స్వల్ప కాలంలోనే ఇంత ప్రగతి సాధించడం మనందరికీ గర్వకారణం అని ఆయన అన్నారు.

అభివృద్ధి పథంలో మెరుపు వేగాన్ని సంక్షేమ పథకాల విషయంలో మానవీయ కోణాన్ని ఆవిష్కరించి కేసీఆర్, తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టారు అని కెటిఆర్ వివరించారు. పరిపాలనలో కొత్త ఒరవడిని ప్రణాళికలో రూపకల్పనలో సరికొత్త పంథాను అనుసరించడం వలన తెలంగాణ ముఖచిత్రం మారింది ప్రజల బతుకులు బాగుపడ్డాయి అని ఆయన స్పష్టం చేశారు. 2014 నుంచి 202 వరకు రాష్ట్రాల స్వయం సమృద్ధి వాటి ఆదాయాలను చూస్తే భారతదేశం మొత్తంలో 17.57%తో భారతదేశం లోనే అగ్ర భాగాన నిలబడ్డ రాష్ట్రం తెలంగాణ అని ఆర్బీఐ చెప్పింది అని ఆయన గుర్తు చేశారు.

### తెలంగాణ ప్రగతినే మా ప్రథమ లక్ష్యం

అధికారంలో ఎవరున్నా తెలంగాణకు మేలు జరగాలి తెలంగాణ ప్రజలు బాగుండాలన్నదే మా పార్టీ లక్ష్యం అని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ఆ బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులు ఎలాంటి ప్రణాళికలు ఎలాంటి విధానపర నిర్ణయాలు తీసుకున్నారు చూసుకొని, దాని ప్రకారం రాష్ట్రానికి వచ్చే వాటా ఎంతో చూసుకొని కేంద్ర ప్రాధాన్యత క్రమాన్ని అర్థం చేసుకొని రాష్ట్రాలు బడ్జెట్ ప్రవేశపెడతాయి అని ఆయన వివరించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో మాత్రం, కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయం పై ఒక్క మాట కూడా లేకపోవడం విషాదం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### పదేండ్లుగా తెలంగాణకు కేంద్రం దగా

గత పదిహేళ్లుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణను ఎలా దగా చేస్తుందో చెప్పి ఉంటే బాగుండేది అని కెటిఆర్ అన్నారు. ఇండియా ఇస్ ఏ యూనియన్ ఆఫ్ స్టేట్స్ అని అంబేద్కర్ రాజ్యాంగంలో ఉంది. రాష్ట్రాలు లేకుంటే కేంద్రం లేదు. అందుకే ఎన్టీఆర్ కేంద్రం మిధ్య అన్నారు అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వాలు చెప్పినట్టు వింటేనే పైసలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం రాజ్యాంగ స్ఫూర్తి కి వ్యతిరేకం అని ఆయన ఆరోపించారు.

### కేంద్రం మోసంపై కాంగ్రెస్ మౌనం

కేంద్ర వైఖరిపై మాటమాత్రమైన నిరసన తెలుపలేదు కాంగ్రెస్ ప్రభుత్వం అని కెటిఆర్ విమర్శించారు. మొన్నటి కేంద్ర బడ్జెట్లో తెలంగాణ అన్న పదమే లేదు. ఢిల్లీ బీహార్ ఎన్నికల కోసమే ఆ బడ్జెట్ ప్రవేశపెట్టారు అన్న విమర్శలు వచ్చాయి అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎనిమిది మంది ఎంపీలు బీజేపీ 8 మంది ఎంపీలు ఉన్నా కూడా,తెలంగాణకు కేంద్ర బడ్జెట్లో గుండుసున్నానే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొట్లాడకపోతే కేంద్రం మన మాట వినదు. మేము కలిసి వస్తాం అని కెటిఆర్ ప్రకటించారు. 2014 నుంచి 2020 వరకు కేంద్ర ప్రభుత్వంతో మేము కూడా సఖ్యతతోనే ఉన్నాము. మిషన్ భగీరథ గజ్వేల్ సెగ్మెంట్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీని ఆహ్వానించాము అని ఆయన గుర్తు చేశారు. కానీ తెలంగాణకు కేంద్రం నుంచి ఒరిగింది ఏం లేదు అని ఆయన విచారం వ్యక్తం చేశారు.

దేశానికి దారి చూపించే ఎన్నో పథకాలను తెలంగాణలో అమలు చేసినా, కేంద్రం నుంచి చిల్లిగవ్వ రాలేదు అని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ పథకాలను కేంద్రం కాపీ కొట్టింది, మన రైతుబంధును కాపీ కొట్టి పిఎం కిసాన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. మిషన్ కాకతీయ పథకాన్ని కాపీ కొట్టి అమృత్ సర్వ పథకాన్ని తీసుకొచ్చారు. మిషన్ భగీరథని కాపీ కొట్టి హర్ ఘర్ జల్ అనే పథకాన్ని ప్రవేశపెట్టారు. టీఎస్ ఐపాస్‌ను కాపీ కొట్టి సింగిల్ విండోను తీసుకొచ్చారు అని ఆయన వివరించారు.

మన బాటలో నడుస్తూ మన డబ్బుల్ని పన్నుల రూపంలో తీసుకుంటూ మనకు మాత్రం తిరిగి ఏమీ ఇవ్వడం లేదు అని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రులు తెలంగాణకు వచ్చే పర్యటనల ఖర్చులు ఇచ్చిన, ఇక్కడ రెండు మూడు పథకాలకు సరిపోతాయి అని ఆయన విమర్శించారు.

### తెలంగాణ ప్రగతి మనకు గర్వం

భారతదేశాన్ని సాదుతున్న టాప్ 5 రాష్ట్రాల్లో తెలంగాణ ఉండడం మనందరికీ గర్వకారణం అని కెటిఆర్ అన్నారు. తెలంగాణ జనాభా 2.8% కానీ దేశ జిడిపికి 5.1% కాంట్రిబ్యూట్ చేస్తున్నాం అని ఆయన హైలైట్ చేశారు. గత ప్రభుత్వమని బీఆర్ఎస్ మీద ఒంటి కాలు మీద లేచే కాంగ్రెస్ నేతలు కేంద్రం మీద మాత్రం ఒక్క మాట మాట్లాడరు అని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం కేంద్రంతో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వివిధ అంశాలపైన, హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కెటిఆర్ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు విషయంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. "కాంగ్రెస్ ఎన్నో ప్రాజెక్టులు కట్టిందని చెపుతున్నారు కదా.. మరి 2014 ముందు ఇంత పంట దిగుబడి ఎందుకు లేదు? కేసీఆర్ వచ్చిన తర్వాతనే ఇంత దిగుబడి ఎలా సాధ్యమైంది?" అని కెటిఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్ మెట్రోను రద్దు చేసిన ప్రభుత్వం, ఫార్మాసిటీని రద్దు చేసి ఫార్మా విలేజ్‌లు అని పేర్కొందని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందని ఆయన నిలదీశారు.

ఫార్మా అంటే విషం, ఫార్మా అంటే పొల్యూషన్ అని కాంగ్రెస్ నేతలు చెబుతారు. అలాంటప్పుడు ఎవరైనా తమ గ్రామంలో ఫ్యాక్టరీ ఎందుకు పెట్టాలని కోరుకుంటారు? ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టకపోతే వాళ్లు ఎందుకు ఒప్పుకుంటారు? ఒక రోజు ఫార్మాసిటీ అంటారు, మరో రోజు ఫ్యూచర్ సిటీ అంటారు, ఇంకో రోజు ఏఐ సిటీ అంటారు, మరో రోజు ఫోర్త్ సిటీ అంటారు. ఇన్ని యూ-టర్న్‌లు తీసుకుంటారా? కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తారా? ఒక్క ఎకరమైనా ఫార్మా పరిశ్రమకు అక్కడ కేటాయించారా?" అని కెటిఆర్ విమర్శించారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీని రద్దు చేసి, సేకరించిన భూములను తిరిగి ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారని, కానీ ఇప్పుడు దానికి విరుద్ధంగా మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. "8800 ఎకరాల్లో మేము ఫార్మాసిటీని నెలకొల్పాలనుకున్నాం. మా హయాంలోనే 400 కంపెనీలు అక్కడ ఫ్యాక్టరీలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మమ్మల్ని బదనాం చేశారు. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్, రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి అన్న ముఖ్యమంత్రి ఇవాళ తెలంగాణలో కుప్పకూలిన రియల్ ఎస్టేట్‌ను పట్టించుకోవడం లేదు," అని ఆయన విమర్శలు గుప్పించారు.

వేణుగోపాల్ రెడ్డి అనే రియల్టర్ ముఖ్యమంత్రికి లేఖ రాసి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చింది? రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పరిస్థితి నిజంగా ఎలా ఉందో ఇక్కడున్న అందరికీ తెలుసు. పేదల మీద ప్రతాపం చూపించే హైడ్రా పెద్దలను మాత్రం కాపాడుతుంది. హైకోర్టు ఎన్నిసార్లు తిట్టినా హైడ్రా తీరు మారడం లేదు," అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ రెవెన్యూ తగ్గింది, జీఎస్టీ రెవెన్యూ తగ్గింది, వాహనాల అమ్మకాలు తగ్గాయి, ఆదాయం తగ్గింది. తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయని వార్తలు వస్తున్నాయి. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది. ఈ రోజు తెలంగాణలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. వాటర్ ట్యాంకర్లను ఆధారం చేసుకుని పంటలను కాపాడుకునేందుకు రైతులు అల్లాడుతున్నారు," అని వివరించారు.

కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని మంత్రులు అనడం రాష్ట్రానికి మంచిది కాదు. కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజ్ మాత్రమే కాదు. మూడు బ్యారేజీలు, 19 రిజర్వాయర్లు, 21 పంప్ హౌస్‌లు, వందల కిలోమీటర్ల సొరంగ మార్గాలు, వేల కిలోమీటర్ల కాలువలు ఉన్నాయి. కాళేశ్వరం కూలిపోయిందని చెప్పే ముఖ్యమంత్రి, ఆ ప్రాజెక్టులో భాగమైన కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తెస్తామని చెబుతారు. కాళేశ్వరం కూలిపోతే కొండపోచమ్మ సాగర్ ఎక్కడిది? మల్లన్న సాగర్, గంధమల్ల, బస్వాపూర్ ఎక్కడివి?" అని కెటిఆర్ సూటిగా ప్రశ్నలు సంధించారు.

హామీల అమలు విషయంలో రేవంత్ రెడ్డి పరిపాలన పూర్తిగా విఫలమైంది. ఆడబిడ్డలకు ఇస్తామన్న 2500 రూపాయలు, అమ్మలు అవ్వలకు పెంచి ఇస్తామన్న పెన్షన్లు ఆగిపోయాయి. తులం బంగారం ఇవ్వడం లేదు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి ఆగిపోయాయి. ఆడబిడ్డలపై అత్యాచారాలు, నేరాలు బాగా పెరిగాయి. శాంతి భద్రతల వ్యవహారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇదే అంశాన్ని రాష్ట్ర పోలీస్ శాఖ విడుదల చేసిన నివేదికలో కూడా ప్రస్తావించారు," అని కెటిఆర్ ఆరోపించారు.

విద్యార్థులకు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని వెంటనే అందించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజాపాలనలో ప్రజాస్వామిక స్ఫూర్తి ఏమాత్రం లేదు. అశోక్ నగర్‌లో ఆడబిడ్డలపై పోలీసులు అమానుషంగా దాడి చేసిన పరిస్థితి ఉంది. ఆటో డ్రైవర్లు, రైతులు, గురుకుల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలి," అని పేర్కొన్నారు.

బీసీ డిక్లరేషన్‌లో 20 వేల కోట్ల రూపాయల బడ్జెట్ పెడతామన్నారు, కానీ రెండు సార్లు కలిపి వెయ్యి కోట్లు కూడా దాటలేదు. కాబట్టి ఈ బడ్జెట్‌లో అంచనాలను సవరించి మరిన్ని నిధులు అందించాలి. ఎస్సీలకు, ఎస్టీలకు, బీసీలకు, మైనారిటీలకు ఇచ్చిన అన్ని హామీలనూ అమలు చేయాలి. డిక్లరేషన్‌లలో పేర్కొన్న మేరకు నిధులను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం," అని కెటిఆర్ స్పష్టం చేశారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
06
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, మార్చి 2025

## శభాష్...లోకేష్!

**స్పీకర్ పాత్రుడు ప్రశంస**




**అమరావతి:** గుంటూరు జిల్లాలో బ్రెయిన్ డెడ్ అయిన ఒక అమ్మాయి గుండెను తిరుపతిలో మరో రోగికి అమర్చేందుకు మంత్రి నారాలోకేష్ స్వయంగా ఖర్చు చేసి ప్రత్యేక విమానం, గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

ఇలా ఒక సందేశంతోనే వేగంగా స్పందించి, ఒకరి అవయవదానం మరొకరికి ప్రాణదానం కలిగేలా చేసిన లోకేష్‌కి అభినందనలు తెలియజేస్తున్నట్టు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## హిందూ ధర్మంపై మాట్లాడే హక్కు పవన్‌కు లేదు

◆ **మాజీ సీఎం జగన్**



**తాడేపల్లి, మహానాడు:** హిందూ ధర్మం, ఆలయాల పరిరక్షణపై మాట్లాడే హక్కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు లేదని మాజీ సీఎం జగన్ అన్నారు. కాశీనాయన క్షేత్రాన్ని కూల్చేస్తుంటే పవన్ ఒక్క మాట కూడా మాట్లాడలేదని జగన్ ఎక్స్ వేదికగా మండి పడ్డారు. 'ఆలయాల పట్ల మాకు ఉన్న చిత్తశుద్ధి కూటమి సర్కార్‌కు లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాశీనాయన క్షేత్రాన్ని కూలుస్తోంది. ఆ ఆలయ అభివృద్ధికి వైసీపీ సర్కార్ ఎంతో కృషి చేసింది అని ఆయన పేర్కొన్నారు.

## గోపిరెడ్డి పద్ధతి మార్చుకోకపోతే ప్రజలు రోడ్ల మీద తిరగనీయరు

◆ **ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**

**నరసరావుపేట, మహానాడు:** ప్రజలు సంతోషంగా ఉంటే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడఅరవిందబాబు విమర్శించారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఓడించారనే అక్కసుతోనే స్థానిక సంస్థల ఎన్నికలు అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. ఎన్నికలు జరిగితే స్థానిక ప్రజా సమస్యలు పరిష్కరించి ప్రజలు సంతోషంగా ఉంటారని, ఆయన్ను ఓడించిన ప్రజల సంతోషంగా ఉండటం ఇష్టం లేకే ఎన్నికలను శ్రీనివాసరెడ్డి



అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఎంపీపీ ఎన్నికలు జరగకుండా ఎంపీటీసీలను నిర్బంధించి రాజకీయ డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. గోపిరెడ్డి పద్ధతి మార్చుకొని ఎన్నికల్లో పాల్గొనే విధంగా సహకరించకపోతే వైసీపీ నాయకులను ప్రజలు రోడ్లమీద తిరగనివ్వరని హెచ్చరించారు.



**గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలిసిన పట్టాభిపురం సీఐగా నియమితులైన గంగా వెంకటేశ్వర్లు**

## తల్లిదండ్రుల కంట కన్నీరు రానీయొద్దు

- బీసీ హాస్టల్ విద్యార్థి దుర్మరణం బాధాకరం
- వార్డెన్ సస్పెన్షన్‌కు ఆదేశం
- విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి:** గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిశోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థి మృతిపై విచారకరమని ఆవేదన వ్యక్తంచేస్తూ, విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు.



ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగలకుంట గ్రామానికి చెందిన బి.కిశోర్ గుంటూరుకు చెందిన వట్టి చెరుకూరు బీసీ హాస్టల్ లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడన్నారు. ప్రమాదవశాత్తు గురువారం ఉదయం చెరువులో పడి కిశోర్ దుర్మరణం పాలవ్వడం బాధాకరమన్నారు. దుర్ఘటన జరిగిన వెంటనే మృతుడి తల్లిదండ్రులకు సమాచారమందించామన్నారు.

హాస్టల్ విద్యార్థుల కదలికలపై దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం వహించిన వార్డెన్ శారదా రాణిని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. చేతికందికొచ్చిన కొడుకు మృతి చెందడం బాధాకరమని, మృతుడి తల్లిదండ్రుల కడుపుకోత వర్ణాతీతమని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత తన ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామన్నారు.

### విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి

హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని వార్డెన్లకు, ఇతర సిబ్బందికి మంత్రి సవిత స్పష్టంచేశారు. ప్రభుత్వంపైనా, అధికారులపైనా నమ్మకంతో తమ పిల్లలను హాస్టళ్లలో చేర్చుతున్నారన్నారు. తల్లిదండ్రులు కంటనీరు పెట్టకుండా, గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు.

వట్టిచెరుకూరు వంటి ఘటనలు చోటుచేసుకోడం క్షమించరాని నేరమన్నారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కానివ్వొద్దని స్పష్టంచేశారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో మంత్రి సవిత స్పష్టంచేశారు.

## 4 గంటల్లోనే సీఎం-డిప్యూటీ సీఎంకి మధ్య 70 వేల కోట్ల తేడా

- బీఆర్ఎస్ హయాంలో అప్పులపై గోబెల్స్ ప్రచారం మానండి
- కాంగ్రెస్ ఏ పేపర్ ఇస్తే, బీజేపీ వాళ్లు అదే మాట్లాడే ప్రయత్నం
- భట్టి బీజేపీని ఒక్క మాట కూడా అనలేదు
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీమంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్:** రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్ చేస్తున్న గోబెల్స్ ప్రచారం బట్టబయలైంది. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక, బీఆర్ఎస్ హయాంలో అప్పులపై దుష్ప్రచారం చేస్తూ తప్పించుకోవాలని సీఎం రేవంత్ ప్రయత్నించారు. ఈరోజు సభలో కాగ్ రిపోర్టుతో అన్ని ఆధారాలతో, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి చేసిన అప్పు 41 వేల కోట్లు మాత్రమే. 16 నెలలుగా మేం ఏం చెప్పామో, కాగ్ రిపోర్టు కూడా అదే చెప్పింది.

భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీలో అదే విషయం చెప్పారు. బీఆర్ఎస్ పదేండ్లలో చేసిన అప్పు 4 లక్షల 17 వేల కోట్లు మాత్రమే. ఏటా 41 వేల కోట్లు- లేదా 42 వేల కోట్లు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో 1 లక్షా 58 వేల కోట్ల అప్పు చేసింది, చేసిన పని సున్నా. 16 నెలల అప్పులు కట్టడానికి 88,564 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామని 7 గంటల 44 నిమిషాలకు చెప్పారు.

సీఎం ఇదే విషయమై 3.58 నిమిషాలకు ఇదే అసెంబ్లీలో ఏం చెప్పారంటే... మేం 1,53,359 కోట్లు అప్పులు, మిత్తీల కింద చెల్లించామని చెప్పారు. అంటే నాలుగు గంటల్లోనే ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి మధ్య 70 వేల కోట్ల తేడా వచ్చింది. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకుల్లారా బీఆర్ఎస్ 6,7,8 లక్షల కోట్ల అప్పు చేసిందని, గోబెల్స్ ప్రచారం మానండి.

ఈ సమావేశాలను బీఆర్ఎస్ అద్భుతంగా ఉపయోగించుకున్నది. మేం కాంగ్రెస్ తప్పిదాలను ఎత్తిచూపాం, వైఫల్యాలను ఎండగట్టాం. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీశాం. జగదీశ్వర్ రెడ్డి అకారణ సస్పెన్షన్‌పై కూడా ప్రభుత్వం మాట తప్పింది. 12 రోజుల్లో 2 రోజులు మాత్రమే ప్రశ్నోత్తరాలు జరిపి, 10 రోజులు రద్దు చేసింది స్వల్పకాలిక చర్చలు జరపలేదు, సీఎం మంత్రుల సమాధానాల్లో సీరియస్ నెస్ లోపించింది.

కేవలం రాజ్యాంగం ప్రకారంగా బడ్జెట్ పాస్ చేసుకోవడమే లక్ష్యంగా సభను నడిపారు.



డీ లిమిటేషన్ మీద మాట్లాడతామంటే కేటీఆర్‌కి మైక్ ఇవ్వలేదు, సీఎం హెడ్ లైన్స్ కోసమే మాట్లాడారు. సీఎం నిన్న సుప్రీంకోర్టులో ఉన్న ఫిరాయింపుల అంశంపై ప్రస్తావించారు, దీన్ని మేం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళతాం. రుణమాఫీ ముగిసిందని చెప్పారు. సభలో చెప్పాను. వానకాలం ఇవ్వాల్సిన రైతుబంధు 8 వేల కోట్లు ఎగ్గొట్టారు. యాసంగిలో 8వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటే 3500 కోట్లు ఇచ్చారు. 4500 కోట్లు ఎగ్గొట్టారు.

అంటే 8+4 = 12 వేల కోట్ల రూపాయలు రైతుభరోసా ఎగ్గొట్టారు, అవే డబ్బులు రుణమాఫీలో కలిపారు. 20 వేల కోట్లలో 12 వేల కోట్లు తీసేస్తే, మీరిచ్చిన రుణమాఫీ కేవలం 8 వేల కోట్లు మాత్రమే. కాంగ్రెస్ – బీజేపీ నాయకుల బంధం ఈ అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టంగా బయటపడింది. కాంగ్రెస్ ఏ పేపర్ ఇస్తే, బీజేపీ వాళ్లు అదే మాట్లాడే ప్రయత్నం చేశారు. మా సభ్యులంతా ప్రజల పక్షాన అనేక సమస్యలు లేవనెత్తారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తప్పుడు సమాచారమిస్తే మా సభ్యుడు వేముల ప్రశాంత్ రెడ్డి ఎత్తిచూపారు. మేం ప్రివిలేజ్ మోషన్ కూడా ఇచ్చాం. కాంగ్రెస్ మేనిఫెస్టోపై మేం అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ జవాబివ్వలేదు. రుణమాఫీపై కొడంగల్ పోదామా, సిరిసిల్లకు వస్తరా అని కేటీఆర్ అడిగితే, ప్రభుత్వం తోక ముడిచి పారిపోయింది. రాష్ట్ర బీజేపీ నాయకులు అప్పుల గురించి మాట్లాడుతున్నరు. 60 ఏండ్లలో ఈ దేశం చేసిన అప్పు 55 లక్షల కోట్లు మాత్రమే అయితే, దేశంలో పదేండ్లలో బీజేపీ 125 లక్షల కోట్ల అప్పు చేసింది. అంటే 57శాతం జీడీపీలో అప్పులు చేసిన బీజేపీ వాళ్లు నీతులు చెబుతున్నారు.

వంద ఎలుకలు తిన్న పిల్లి నేను శాఖాహారిని అన్నట్లుంది బీజేపీ తీరు. ఈరోజు కూడా తెలంగాణ రాష్ట్ర అప్పులు జీడీపీలో 27శాతం మాత్రమే. మేం సభలో రుణమాఫీలో ఫెయిలైందని ఎండగట్టాం.. మహాలక్ష్మి, 4 వేల పెన్షన్, స్కూటీలు, తులం బంగారం విషయంలో నిలదీశాం. ప్రాజెక్టుల పూర్తిపై మంత్రి ఉత్తమ్ గారిని అడిగితే నీళ్లు నమిలారు తప్ప, నీళ్ల విషయం ఏమీ చెప్పలేకపోయారు.

సభలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ పార్టీ ఎత్తి చూపింది. ప్రజల పక్షాన పోరాడి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయగలిగింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక్క రూపాయి ఇవ్వకున్నా భట్టి మాత్రం బీజేపీని ఒక్క మాట కూడా అనలేదు, బీజేపీ కాంగ్రెస్ చెరో 8 మంది ఎంపీలు గెలిచినా అన్యాయం చేశాయని కేటీఆర్ స్పష్టంగా చెప్పారు. బీజేపీ కాంగ్రెస్ పార్టీలు తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని మేం ఎత్తి చూపగలిగాం

## నాలా చట్టం రద్దుపై త్వరలోనే విధివిధానాలు

- నారెడ్కో ప్రతినిధులతో మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి:** నాలా చట్టం రద్దుపై త్వరలోనే విధివిధానాలను విడుదల చేస్తామని రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ప్రకటించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో రియాల్టీ సంస్థ అయిన నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్ మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) ప్రతినిధులు గురువారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ ను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. నాలా చట్టం రద్దు వెనుక మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషి ఎంతో ఉందని వారు చెప్పారు. మంత్రి సత్యప్రసాద్ కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు.

ఈ సందర్భంగా వారితో మంత్రి అనగాని మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పుడూ డైనమిక్ నిర్ణయాలు తీసుకుంటారని, నాలా చట్టం రద్దు నిర్ణయం కూడా అందులో భాగమేనని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ లో భాగంగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే సీఎం వద్దకు తీసుకెళ్లి త్వరగా నిర్ణయం తీసుకోగలిగామని చెప్పారు. నాలా చట్టం రద్దుపై విధివిధానాలు కూడా అతి త్వరలోనే వస్తాయని చెప్పారు. నాలా చట్టం రద్దు రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పారిశ్రామిక రంగాల ప్రగతికి ఎంతో దోహదపడుతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నాలా రద్దు చేయాలన్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుందని నారెడ్కో ప్రతినిధులు తెలిపారు. నాలా అనుమతులు తెచ్చుకునేందుకు ఏడాది పాటు సమయం పట్టడంతో పాటు ఫీజులు కూడా అధికంగా ఉంటున్నాయని చెప్పారు. నాలా



రద్దుకు ప్రత్యేక కృషి చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి అనగానిని కలిసిన వారిలో నారెడ్కో సంస్థ ప్రతినిధులు గద్దె చక్రధర్, కిరణ్ పరుచూరి, దుర్గాప్రసాద్, సీతారామయ్య, జగన్, నాగవంశీ, పాపారావు ఉన్నారు.



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 28, మార్చి 2025 ‖




## గత ప్రభుత్వ అహంభావం, కక్షతో

# పోలవరం ప్రాజెక్టుకు నష్టం

- పోలవరం నా సెంటిమెంట్... 2019 తర్వాత ప్రాజెక్టు దుస్థితి చూసి బాధపడ్డాను
- రివర్స్ టెండర్ వల్ల రూ.2,782 కోట్లు అదనపు భారం పడింది
- పరిస్థితులు చక్కదిద్ది 9 నెలల్లోనే ప్రాజెక్టును గాడినపెట్టాం
- 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తాం
- పోలవరం-బనకచర్ల అనుసంధానం చేపడతాం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిశీలన అనంతరం అధికారులతో సమీక్ష

**పోలవరం:** పోలవరం ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం క్షమించరాని తప్పులు చేసింది. కక్ష, అహంభావంతో ఇష్టానుసారంగా వ్యవహరించింది. ప్రాజెక్టు విషయంలో తొందరపడొద్దని పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్రం చెప్పినా వినకుండా వారికి నచ్చినట్లు ప్రవర్తించారు. రివర్స్ టెండర్ పేరుతో రాజకీయం చేశారు. దీని వల్ల రూ.2,782 కోట్లు అదనపు భారం పడింది. కాంట్రాక్టర్లను మార్చారు. 6 నెలల పాటు ప్రాజెక్టును పట్టించుకోలేదు. ప్రాజెక్టు దుస్థితి చూసి రాష్ట్రంలో బాధపడిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది నేనే. పోలవరం ప్రాజెక్టు నా సెంటిమెంట్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను గురువారం సీఎం పరిశీలించారు. అనంతరం అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించి, మీడియాతో మాట్లాడారు.

### 9 నెలల్లోనే 3 సార్లు పరిశీలించా

'ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక 3వసారి పోలవరం ప్రాజెక్టును పరిశీలించడానికి వచ్చాను. 9 నెలల్లోనే ప్రాజెక్టును గాడినపెట్టాం. సులభంగా పూర్తవ్వాల్సిన ప్రాజెక్టును నాశనం చేశారు. 2019లో మేం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉండుంటే 2020 ఆగస్టు నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేసేవాళ్లం. పోలవరం ఏపీకి జీవనాడి. ఇది పూర్తైతే 7.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 23.50 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు 28.5 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించవచ్చు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, విశాఖ పట్నంలోని ప్రజలు, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని అందించ వచ్చు. ఈ ఏడాది 4 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలిసింది. ఈ నీళ్లలో కనీసం నాలుగైదు వందల టీఎంసీల నీళ్లు వినియోగించుకున్నా రాష్ట్రంలో కరువు అనేది లేకుండా చేయవచ్చు.' అని అన్నారు.

### ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వమే శ్రద్ధ తీసుకోవాలని నీతి ఆయోగ్ తెలిపింది

ఏపీ విభజన చట్టంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేర్చారు. ఆ సమయంలో ముంపునకు గురయ్యే 7 మండలాలు తెలంగాణలో ఉన్నాయి. దీని వల్ల ప్రాజెక్టు ముందుకు సాగదని కేంద్రానికి తెలిపి, ఆ 7 మండలాలు ఏపీలో కలపాలని అడగడం వల్ల పార్లమెంట్ సమావేశాలకంటే ముందుగానే కేబినెట్‌లో ఆమోదించి ఆర్డినెన్స్ ఇచ్చారు.

కేంద్ర ప్రాజెక్టులు పూర్తైన వాటి చరిత్ర చూస్తే ఆశాజనకంగా లేదని, ప్రాజెక్టును పూర్తి చేయాలంటే రాష్ట్రమే శ్రద్ధ తీసుకుంటే బాగుంటుందని నీతి ఆయోగ్ చెప్పింది. ఎట్టి పరిస్థితుల్లో ప్రాజెక్టును పూర్తిచేయాలన్న సంకల్పంతో పనులు చేపట్టి 2019 నాటికి 73 శాతం పూర్తి చేశాం. ఒకేరోజున 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి గిన్నీస్ రికార్డ్ సాధించాం. 414 రోజుల్లో 1,397 మీటర్ల డయాఫ్రం వాల్ నిర్మించాం. నేరుగా 28 సార్లు సందర్శించా, 82 సార్లు వర్చువల్‌గా సమీక్ష చేశాను.

### 2026 ఫిబ్రవరి 26కి ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1 పూర్తి

2019లో ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టు పరిస్థితి ఏమైందో అంతా చూశారు. డయాఫ్రం వాల్‌ను దెబ్బతీశారు. కాఫర్ డ్యాం సకాలంలో పూర్తి చేసి ఉంటే డయాఫ్రం వాల్ దెబ్బతినేది కాదు. మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పరిస్థితిని అధ్యయనం చేయడానికి విదేశీ నిపుణులు వచ్చి పరిశీలించారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని సూచించారు. మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాల్సి వచ్చింది.

అంతకు ముందు ఖర్చు పెట్టిన రూ.440 కోట్లు వృథా అయ్యాయి. డయాఫ్రం వాల్‌ను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1ను 2026 ఫిబ్రవరి 26కు పూర్తి చేస్తాం. ఎడమ కాలువ 2026 జూన్‌కు పూర్తవుతుంది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2 మాత్రం 2027 డిసెంబర్‌కు గడువు పెట్టారు. టెక్నికల్ సమస్యలు ఉంటే తప్ప 2027 ఏప్రిల్ లేదా జూన్‌కు పూర్తి చేయాలని ఆదేశించాను.

ఫేజ్-1ఏ, ఫేజ్-2 1ఏ, 1బీ పూర్తికి భూ సేకరణ ఇంకా చేయాల్సి ఉంది. దాదాపు 26 పునరావాస కాలనీలు పూర్తయ్యాయి. మరో 49 పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 14,329 మందిని పునరావాసాలకు తరలించాం, మరో 6,578 మందిని తరలించాల్సి ఉంది. ఇవన్నీ పూర్తి చేయాలంటే మరో రూ.500 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంది. రూ.972 కోట్లు ఖర్చు చేసి ఈ ఏడాది నవంబర్‌కు ఫేజ్-1ఏలో ఉండే అందరికీ పునరావాసం కల్పిస్తాం. జూలై 2026కు ఫేజ్-1బి కింద 6 మండలాల్లో 48 పునరావాసాలు పూర్తి చేస్తాం.

ఫేజ్-1ఏ, ఫేజ్-2 1ఏ, 1బీకి కలిసి రూ.6,270 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఫేజ్-1లో 41.15 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణం ఉంటుంది. వాస్తవానికి ప్రాజెక్టు ఎత్తు 45.74 మీటర్లు. 2019కి ముందు ఈ ఫేజ్1, ఫేజ్2 ప్రస్తావన లేదు. ఇది కూడా గతపాలకుల తప్పే. కానీ మళ్లీ వెనక్కి వెళ్తే ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం. అందుకే మొదట ఫేజ్1 పూర్తి చేసి తర్వాత ఫేజ్-2 మొదలుపెడతాం.

### పునరావాస ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు

భూసేకరణ, పునరావాసానికి కూడా అదనంగా ఖర్చు అవుతోంది. ఒక వ్యక్తి చేసిన తప్పులను రాష్ట్రం ఏ విధంగా భరించాల్సి వస్తుందనడానికి ఇదొక ఉదాహరణ. సాగునీరు వచ్చినప్పుడు రైతులు ఆనందంగా ఉంటారు. కానీ ప్రాజెక్టు కోసం తరాలుగా ఉంటున్న ప్రజలు కూడా వారి భూములు, ఆవాసాలు కోల్పోవాల్సి ఉంటుంది. వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అదనంగా ఇంకా ఏమీ చేయగలుగుతామో ఆలోచించి, వారి జీవితాల్లో మరింత మార్పులు తీసుకురావాల్సి ఉంది. పునరావాస ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టే అంశాన్ని కూడా పరిశీలిస్తాం. ఎంఎస్ఎంఈలు పెట్టుకుంటే ప్రభుత్వ తరఫున ప్రోత్సహిస్తాం.

### ప్రాజెక్టును నేనే పూర్తి చేస్తున్నందుకు సంతోషంగా ఉంది

కొన్ని సమయాల్లో కొంతమందికి అద్భుత అవకాశాలు వస్తాయి. ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని రాష్ట్ర రూపురేఖలు మార్చాలని ఎంతో ప్రయత్నించాను. కానీ 2019లో అది సాకారం అయ్యే నాటికి పరిస్థితి మారింది. పరిశ్రమ పెట్టిన వ్యక్తి నష్టాలతో కూలిపోతే ఏ విధంగా బాధపడతారో నేను కూడా అలాగే బాధపడ్డాను. మళ్లీ భగవంతుడి ఆశీర్వాదంతో అవకాశం లభించింది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేంద్రం నుంచి అవసరమైన నిధులు వచ్చాయి. ప్రాజెక్టును నేను పూర్తి చేస్తున్నందుకు సంతోషం కలుగుతోంది. పోలవరం నిర్మాణాన్ని ఆదర్శంగా తీసుకుని పోలవరం-బనకచర్ల అనుసంధానం చేపట్టి పూర్తి చేస్తాం. ఈ రెండూ చేయగలిగితే జీవితానికి పరమార్థం ఉంటుంది. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో నేను, నా మిత్రుడు పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# అస్మదీయులకే పోలవరం కాంట్రాక్టులు

- కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్టును సర్వనాశనం చేశారు
- డబ్బు ఆశతోనే కేంద్రం నుంచి ప్రాజెక్టును తెచ్చుకున్నారు
- ఇప్పుడు కూడా ప్రాజెక్టు ఎత్తు తగ్గింపునకు ఆమోదం
- ఆయన చేసిన తప్పులను మాపై నెట్టాలని చూస్తున్నారు
- చంద్రబాబు తప్పిదాల వల్లనే ప్రాజెక్టు పనుల్లో జాప్యం
- వైయస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు



**గుంటూరు:** పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసింది చంద్రబాబే అని, ఆయన పాపమే పోలవరం ప్రాజెక్టుకు శాపం అని వైయస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. కేవలం కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్టును సర్వనాశనం చేశారని, డబ్బు ఆశతోనే, కేంద్రం నుంచి ప్రాజెక్టు తెచ్చుకున్నారని, ఇప్పుడు కూడా ప్రాజెక్టు ఎత్తు తగ్గింపునకు ఆమోదం తెలిపి, రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని, ఆయన చేసిన తప్పుల న్నింటినీ తమపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

కేవలం చంద్రబాబు తప్పిదాల వల్లనే ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగిందన్న అంబటి రాంబాబు, వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పనుల్లో వేగం పుంజుకుందని, ప్రాజెక్టులో కీలక పనులన్నీ తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేశామని గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు.

2018లో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి 2019 ఎన్నికలకు వెళ్తామని అప్పటి ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమ అసెంబ్లీలో ప్రకటించారు. ఆ పని చేయలేకపోయారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చాక, 2027లో పోలవం పూర్తి చేస్తామని చంద్రబాబు చెబుతున్నారు. పోలవరం నిధులను జగన్ డైవర్ట్ చేశారంటున్న చంద్రబాబు, దాన్ని నిరూపిస్తే నేను ఆయనకు సాష్టాంగ నమస్కారం చేస్తా.

పోలవరం ప్రాజెక్టును తామే పూర్తి చేస్తామని విభజన చట్టంలో కేంద్రం స్పష్టం చేసినా, కమిషన్లకు కక్కుర్తి పడిన చంద్రబాబు, ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత తీసుకున్నారు. అది కూడా 2013%-%14 ధరలతో ప్రాజెక్టు పనులు చేస్తామని 2016లో ఒప్పందం చేసుకున్నారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తే ఆ నిధులను కేంద్రం రీయింబర్స్ చేసేలా ఆ ఒప్పందం జరిగింది. అలాంటప్పుడు కేంద్రం నిధులను జగన్ డైవర్ట్ చేశారని చంద్రబాబు విమర్శించడం అత్యంత హేయం. ప్రాజెక్టు పనులు, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పరిశీలించాకే కేంద్రం ఆ నిధులు రీయింబర్స్ చేస్తుందన్న విషయం సీఎం చంద్రబాబుకు తెలియదా?.

పోలవరం ప్రాజెక్టు పనులను తన అనుయాయుల కంపెనీలకు కట్టబెట్టిన చంద్రబాబు, వారు (ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ) అడిగిందే తడువుగా అగ్రిమెంట్ విలువను రూ.4,054 కోట్ల నుంచి రూ.5,386 కోట్లకు పెంచుతూ ఉఇఇ నిబంధనలకు విరుద్ధంగా రూ.1,332 కోట్ల అనుచిత లబ్ధి చేకూరుస్తూ, 2016 సెప్టెంబరు 29న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత పనులు క్యాన్సిల్ చేసి, నామినేషన్ పద్ధతిలో నవయుగ కంపెనీకి పెంచిన రేట్ల ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.3,000 కోట్ల పని అప్పగించారు. ఈ రెండు కంపెనీలు చంద్రబాబు అస్మదీయులవే కావడం గమనార్హం.

నవయుగ కంపెనీ వారు అధికంగా లాభం ఉండే కాంక్రీట్ పనులే పూర్తి చేశారు. కానీ క్రిటికల్ కాంపొనెంట్లు అయిన రెండు కాఫర్ డ్యామ్ పనులు మాత్రం నత్తనడకన చేశారు. కాఫర్ డ్యాం మధ్యలో వదిలేసి డయాఫ్రం వాల్ పూర్తి చేశారు. ఈ అనాలోచిత నిర్ణయం కారణంగా వరద ప్రవాహానికి డయాఫ్రం వాల్ కొట్టుకుని పోయింది. సాంకేతికంగా తప్పు చేసి, జగన్ కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందని ఆరోపిస్తూ, రాజకీయం చేస్తున్నారు.

కాఫర్ డ్యాం పూర్తి చేయకుండా డయాఫ్రం వాల్ నిర్మాణం చేయడం ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. కానీ, చంద్రబాబు నేతృత్వంలో పోలవరం ప్రాజెక్టు విషయంలో జరిగింది. కమీషన్ల కోసం కక్కుర్తి పడి చంద్రబాబు చేసిన ఈ తప్పు కారణంగా భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

జగన్ సీఎం అయ్యాక అనేకసార్లు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పోలవరం నిర్మాణానికి కేంద్రమే అడ్వాన్సుగా నిధులు చెల్లించేలా ఒప్పించడంతోపాటు 2016-17 రేట్లకు అనుగుణంగా సవరించిన అంచనాలకు కేంద్రాన్ని ఒప్పించారు. గతంలో 2013%-%14 ధరలు చెల్లించేలా చంద్రబాబు చేసుకున్న అనాలోచిత ఒప్పందాన్ని ఆయన కేంద్రంతో పోరాడి సవరింప చేశారు.

కేంద్రం పోలవరం కోసం విడుదల చేసిన ఆ నిధులను చంద్రబాబు ప్రభుత్వం వివిధ కార్యకలాపాల కోసం మళ్లించింది. దీనిపై దాదాపు 15సార్లు కేంద్రం సీరియస్ అవడంతో జాయింట్ అకౌంట్‌లో వేసిన దుస్థితికి పోలవరం ప్రాజెక్టును తీసుకొచ్చాడు చంద్రబాబు. కేంద్ర ప్రభుత్వం పోలవరం అడ్వాన్సు కోసం ఇచ్చిన రూ.12,557 కోట్లు డైవర్ట్ చేసిన చంద్రబాబు గత మా ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు. నిపుణుల సూచనల మేరకు రెండో డయాఫ్రం వాల్ నిర్మాణం చేయాల్సి ఉంటే, ఆ పనులే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తోంది.

నిర్బంధాలు, అక్రమ కేసులను ఎదిరించడంతోనే వైయస్సార్‌సీపీ పురుడు పోసుకుందనే విషయం గుర్తుంచుకోవాలి. అరెస్టులతో జగన్ శక్తిని అడ్డుకోలేరు. వికృత చేష్టలకు పాల్పడుతున్న పోలీసులకు, ఎర్ర బుక్కు రాస్తున్న లోకేష్‌కు రాబోయే రోజులు ఎంత దారుణంగా ఉంటాయో మీ ఊహకే వదిలేస్తున్నా.

మా పార్టీ నుంచి టీడీపీలోకి వెళ్లి లిక్కర్ స్కాం జరిగిందని చెప్పిన లావు శ్రీకృష్ణదేవరాయలు రేపు మళ్లీ మా పార్టీలోకొస్తే టీడీపీ హయాంలో లిక్కర్ స్కాం జరిగిందని చెబుతాడేమో! అని అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.

# ఆర్థిక విధ్వంసం మొత్తం తవ్వి తీస్తా

- నేను యాదృచ్ఛికంగా పొలిటికల్ లీడర్ కాలేదు
- చాలా ఆలోచించి రాజకీయాల్లోకి వచ్చా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** నేను యాదృచ్ఛికంగా పొలిటికల్ లీడర్ కాలేదు.. చాలా ఆలోచించి రాజకీయాల్లోకి వచ్చా. ఒక ఫ్యూడల్ వ్యవస్థలో, భావ దారిద్రంలో కూరుకుపోయిన వారిని బయటపడేయాలని రాజకీయాల్లోకి వచ్చా. సమ సమాజం స్థాపనతోనే అభివృద్ధి అది జరగాలంటే చట్టసభల ద్వారానే సాధ్యమని రాజకీయాల్లోకి వచ్చా.

ప్రజల జీవన విధానం బాగుపడాలని అంతా ఆత్మగౌరంతో జీవించడం కోసం రాజకీయాల్లోకి వచ్చా. మీలాగా వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయాల్లోకి రాలేదు. వచ్చిన అవకాశాన్ని సమ సమాజ స్థాపన కోసం వినియోగిస్తాను. మీలాగా దుర్బుద్ధితో రాజకీయాల్లోకి రాలేదు. బయట చాలా మాట్లాడుతారు అని వాటిని సభలో ప్రస్తావిస్తున్నారు. మేం మాట్లాడడం మొదలుపెడితే మీ కన్నా ఎక్కువ మాట్లాడగలం. గంజాయి రాజు, లిక్కర్ రాణి అని బయట చాలా మాట్లాడుతున్నారు. అవి సభలో మేము మాట్లాడం సభ్యత కాదు.

ఆర్థిక శాఖలో జరిగిన ఆర్థిక విధ్వంసం మొత్తం తవ్వితీస్తా. ఉన్న విషయాలు సభలో రాష్ట్ర ప్రజల ముందు పెట్టి వివరిస్తా..సంక్షేమమే మాకు ప్రాధాన్యత రంగం. రాబడి ఖర్చు ఏయే శాఖలకు ఎంత కేటాయింపులు అర్థవంతంగా అవసరాలకు తగిన విధంగా బడ్జెట్ రూపొందించాం. ప్రజల పక్షాన నిలబడి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఈ ప్రభుత్వం పనిచేస్తుంది

మీ 10 సంవత్సరాల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, శ్రీ శిశు సంక్షేమం కోసం 70,474 కోట్లు కేటాయించి ఖర్చు చేయలేదు.. ఎస్సీ సబ్ ప్లాన్ కింద 50 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పారు మీరు చేయలేదు. మేం అధికారంలోకి రాగానే ఆర్థిక, సామాజిక, రాజకీయ సర్వే జరిపించాం. రాష్ట్రంలో 86% ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమానికి మీరు నిధులు ఖర్చు చేయలేదని నిర్ధారణ జరిగింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే సంక్షేమం కోసం మొట్టమొదటిసారి రికార్డు స్థాయిలో కేటాయింపులు చేశాం. మూడు లక్షల 4 వేల కోట్ల బడ్జెట్లో 1,44,156 కోట్లు సంక్షేమం కోసం కేటాయించాం.

మేం రాబడి నీ దృష్టిలో పెట్టుకొని ఆ మేరకే ఈ బడ్జెట్లో కేటాయింపులు చేశాం. 40 వేల కోట్ల బిల్స్ మీరు పెండింగ్లో పెట్టి పోయారు. ఉద్యోగుల బకాయిలు కాకుండానే 40 వేల కోట్లు పెండింగ్లో పెట్టారు. 1,59,940 లక్షల కోట్ల పనులు శాంక్షన్ చేసి పోయారు.. ఆ పనుల బిల్లులు పెండింగ్లో పెట్టి పోయారు.

ఉద్యోగులు రిటైర్ అయితే భారం మీపై పడుతుందని, మూడు సంవత్సరాలు పెంచారు. మొత్తం ఉద్యోగుల బకాయిలు 20వేల కోట్లు ఉండగా అందులో మేం 16 వేల కోట్లు క్లియర్ చేశాం. పాలనలో భాగస్వాములు ఉద్యోగులు.. వారిని పిలిచి బకాయిలకు సంబంధించి వివరాలు వెల్లడించి, రాబోయే రోజుల్లో వాటిని ఎలా క్లియర్ చేస్తామో ఉద్యోగులకు వివరించగా వారు సంతృప్తి చెందారు.

మీరు లక్ష కోట్లు అప్పు తెచ్చి లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. మీరు తెచ్చిన అప్పులకు పదేళ్ల తర్వాత చెల్లిం పులు ప్రారంభంఅయ్యాయి.. ఆ లక్ష కోట్లు అప్పులు మాపై వదిలివేశారు. పెండింగ్ బిల్స్ రీపేమెంట్ భారం మా ప్రభుత్వం పైపడింది. మీలాగా 20% అంచనాలు పెంచకుండా వాస్తవిక బడ్జెట్ను ప్రవేశపెట్టాం.

లక్ష మంది అధికారులతో నభూతో న భవిష్యత్తు అన్నట్టు కుల సర్వే చేశాం.. ప్లానింగ్ శాఖను నేనే చూస్తున్నాను. ఈ రాష్ట్ర వనరులు వెనుకబడిన పేద వర్గాలకు ఎలా పంచాలి అనే విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్యాబినెట్ కు కమిట్మెంట్ ఉంది. కాబట్టి సర్వే పూర్తి చేశాం.. వనరులు రాజకీయాల్లో జనాభా దామాషా ప్రకారం పంపిణీకి విశ్లేషణ చేస్తున్నాం

మీలాగా దోపిడీ చేయడానికి రాజకీయాల్లోకి రాలేదు. ఈ సమాజంలో కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ పరిష్కారం కాలేదు. నిజమే వాళ్లకు వాటా దక్కాలని మా ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టింది.. దశాబ్దాలుగా పరిష్కరించని సమస్యను మా సీఎం యావత్ క్యాబినెట్ పరిష్కరించింది. కుల సర్వే ద్వారా స్టడీ చేసాం కాబట్టి సంక్షేమానికి



నిధులు పెట్టాం అవి ఖర్చు పెట్టే బాధ్యత మా ప్రభుత్వానిది. ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతాం అందుకే బడ్జెట్లో 56,084 కోట్లు కేటాయించాం వాటిని తూచా తప్పకుండా అమలు చేస్తాం.

రాష్ట్రం వస్తే మేలు జరుగుతుందని నిరుద్యోగులు ఆత్మార్పణం చేసుకున్నారు. మా ప్రభుత్వం వచ్చాక 57,000 మందికి ఉద్యోగాలు ఇచ్చాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసాం. జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేసి తీరుతాం.

పదేళ్లుగా మీరు స్వయం ఉపాధి పథకాలను పట్టించుకోలేదు. నిరుద్యోగుల సమస్యలను అర్థం చేసుకున్న మేము 6000కోట్లతో స్వయం ఉపాధి పథకాలు ప్రవేశపెట్టాం.. బ్యాంకు లింకేజీ తో కలిపి మొదటి ఏడాది తొమ్మిది వేల కోట్లతో స్వయం ఉపాధి పథకాలు నిరుద్యోగులకు అందించబోతున్నాం.

వైశ్య కార్పొరేషన్ కి 25 కోట్లు, బ్రాహ్మణ పరిషత్ కు గతంలో 50 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్లో దానిని 100 కోట్లకు పెంచాం. ఎస్సీ సబ్ ప్లాన్ కు 40 వేల కోట్లు కేటాయించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచాం. మీ పాలనలో రాజీవ్ ఆరోగ్యశ్రీ కి 10 సంవత్సరాల కాలంలో ప్రతి సంవత్సరం సగటున 540 కోట్లు కేటాయిస్తే మేము మొదటి ఏడాదిలోనే 1205 కోట్లు కేటాయించాం.

ఓవర్సీస్ స్కాలర్షిప్ అడ్డగోలుగా శాంక్షన్ లీటర్లు మీరు ఇచ్చి వెళ్లారు.. ఎన్నికల కోసం మీరు శాంక్షన్ లెటర్లు ఇస్తే.. రాష్ట్ర బిడ్డల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విదేశాల్లో వారు ఇబ్బందులు పడొద్దని మేము 169 కోట్లు విడుదల చేశాం.. ఏడాది ఈ సంఖ్యను మరింత పెంచుతున్నాం.

మీ పాలనలో కాంట్రాక్టర్లకు ప్రతి ఏటా ఎస్టిమేట్లు పెంచి ఎప్పటి కప్పుడు బిల్లులు మంజూరు చేశారు తప్ప సంక్షేమ వసతి గృహాల పిల్లల డైట్ కాస్మోటిక్ చార్జీలను పట్టించుకోలేదు.. మేం అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ చార్జీలు 25% కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం.

మీ 10 సంవత్సరాల పాలనలో ఒక్క రెసిడెన్షియల్ స్కూల్ కూడా కట్టలేదు. మీ నాయకుల కోళ్ల ఫారాలు అద్దెకు తీసుకొని రేట్లు పెంచి, వారికి చెల్లింపులు చేశారు. మీరు ఆ హద్దులు ఏడాదికి 14 కోట్లు విడుదల చేస్తే మేము 126 కోట్లు సగటున సంవత్సరానికి విడుదల చేసాం.. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి 11,600 కోట్లు కేటాయించాం. 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఈ స్కూల్స్ నిర్మిస్తున్నాం. మండల జిల్లా పరిషత్తు పాఠశాలలు బాగు చేయడానికి విద్యా కమిషన్ నియమించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం.విద్యార్థుల భవిష్యత్తు రాష్ట్ర భవిష్యత్తుగా భావించి కార్యాచరణ చేపట్టాం.

# పారదర్శక విధానాలకు పాతర

- కారుచౌకగా "లులూ"కు అత్యంత ఖరీదైన భూమి
- రూ.2000 కోట్ల భూమిని 99 ఏళ్ళకు ఎలా లీజుకు ఇస్తారు?
- లులూకు ఇచ్చే భూమికి రూ.170 కోట్ల మేర రాయితీలు
- ఈ సొమ్ముతో ప్రభుత్వమే నిర్మాణాలు చేపట్టవచ్చు
- ప్రైవేటు సంస్థకు మేలు చేసేందుకు తెగబడిన కూటమి సర్కార్
- విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ

**విశాఖపట్నం:** విశాఖపట్నం బీచ్‌కు సమీపంలో దాదాపు రూ.2000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా లలూ మాల్‌కు దారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోందని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇచ్చే సందర్భంలో పాటించాల్సిన నిబంధనలకు పాతర వేస్తూ, ఏకంగా 99 ఏళ్ళకు లీజుకు ఇచ్చేందుకు సిద్ధపడటం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. అంతేకాకుండా ఏకంగా రూ.170 కోట్ల విలువైన రాయితీలను కూడా సదరు సంస్థకు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం తెగబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

రాష్ట్రప్రభుత్వం విశాఖపట్నంలోని అత్యంత విలువైన సుమారు పదమూడు ఎకరాల భూమిని లులూ మాల్ కు ఇవ్వాలని నిర్ణయించింది. ఆ సంస్థకు ఏడాదికి ఎకరానికి రూ.50 లక్షలకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ భూమిలో లులూ సంస్థ సినిమా హాళ్లు, రెస్టారెంట్లు, కన్వెన్షన్ సెంటర్, ఇతర వాణిజ్య సముదాయాలను నిర్మిస్తుంది.

వాణిజ్య సముదాయాల నిర్మాణాలకు బీచ్ పక్కన ఉన్న భూమి ఎకరా వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తిని ఒక ప్రైవేటు సంస్థకు ఎలా దారాదత్తం చేస్తారో చెప్పాలి. దీనివల్ల ప్రభుత్వానికి ఎంత వస్తుందీ అని చూస్తూ నామమాత్రంగానే ఆదాయం లభిస్తుంది. ఇదేనా చంద్రబాబు చెబుతున్న సంపదసృష్టి.

### ప్రభుత్వ నిబంధనలు వర్తించవా?

ప్రభుత్వం వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తిని దీర్ఘకాలానికి ఎటువంటి పాదర్శక విధానాలను అవలంభించకుండా కట్టబెట్టడం సమంజసమా? ప్రభుత్వానికి తన వద్ద ఉన్న భూమి నుంచి ఆదాయాన్ని పొందాలంటే, దానికి నిర్ధిష్టమైన విధానాన్ని అలంభించాలి. గతంలో తమకు లులూతో ఉన్న సంబంధాలతో నామమాత్రపు రేట్లకే లీజుకు ఇవ్వడం వెనుక మతలబు ఏమిటీ? సినిమాహాళ్ళు, రెస్టారెంట్లు కట్టాలి అనుకుంటే ఎక్కడైనా నిర్మించవచ్చు. అహ్లాదం, ఆనందం కోసం ప్రజలు కాస్త దూరమైనా వెడతారు. లేదా ఏదైనా ఒక కొత్త ప్రాజెక్ట్ తీసుకువస్తున్నారంటే దానిపైనా ఆలోచించవచ్చు.

వాణిజ్య సముదాయాల కోసం వేల కోట్ల రూపాయల విలువైన భూములను ఎలా కేటాయిస్తారు? స్టాంప్ డ్యూటీ, మిగిలిన ఇతర పన్నులు దాదాపు రూ.170 కోట్ల వరకు మినహాయింపులు కల్పిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో రాయితీలు ఇచ్చే బదులు ఆ సొమ్ముతో ప్రభుత్వమే వాణిజ్య సముదాయాలను నిర్మించుకోవచ్చు. ప్రభుత్వ నిర్ణయాన్ని వైయస్ఆర్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ భూమి ద్వారా ఆదాయం పొందాలని భావిస్తే, పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, వివిధ సంస్థలను ఆహ్వానించాలి. లేకపోతే దీనిలో లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయని



అనుమానించాల్సి వస్తుంది.

### వ్యవస్థలను కుప్పకూలుస్తున్నారు

ఈరోజు రాష్ట్రంలో జరిగిన స్థానిక ఉప ఎన్నికల్లో మరోసారి కూటమి ప్రభుత్వం అరాచకానికి పాల్పడింది. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం అప్రజాస్వామిక విధానాలకు పాల్పడాల్సిన అవసరం ఉందా? సాధారణంగా ప్రజాస్వామిక విధానాలకు అనుగుణంగా, చట్టప్రకారం ఎన్నికలు జరుగుతుంటాయి. ప్రజాతీర్పునకు అనుగుణంగా పదవులు దక్కుతుంటాయి. కానీ కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు, దుర్మార్గాలు, బెదిరింపులతో స్థానిక ఉప ఎన్నికల్లో పదవులను చేజిక్కించుకునేందుకు ప్రయత్నించడం దారుణం.

రాష్ట్రంలో శాంతిభద్రతలను కూడా ఫణంగా పెట్టి, ఉప ఎన్నికల్లో పదవులను పొందేందుకు ప్రయత్నించడం హేయం. పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని ఇటువంటి దౌర్జన్యాలకు ప్రభుత్వమే ప్రయత్నించడం ఎటువంటి సంకేతాలను ఇస్తున్నట్లు? వ్యవస్థలను కుప్పకూల్చి మరో బీహార్‌గా ఈ రాష్ట్రాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్నారు. దీనిని వైయస్ఆర్‌సీపీ పూర్తిగా ఖండిస్తోంది. ఎన్నికలకు వెడుతున్న వారిని అడ్డుకోవడం, వారిపై దౌర్జన్యం చేయడం, వాయిదాలు వేయడం, పోలీసులను ప్రేక్షకపాత్రకే పరిమితం చేయడం ఎటువంటి ప్రజాస్వామిక విధానం?

యాదవ సామాజికవర్గంకు చెందిన ఒక బీసీ మహిళకు వైయస్ ఆర్‌సీపీ విశాఖ నగర మేయర్‌గా అవకాశం కల్పించింది. నాలుగేళ్ళ పాటు ఆమె మేయర్‌గా కొనసాగారు. ఈ చివరి ఏడాదిని కుట్రలు కుతంత్రాలతో తెలుగుదేశం పార్టీ ఆమెను పదవి నుంచి దింపేందుకు ప్రయత్నించడం దారుణం. దీనిని బీసీ సామాజికవర్గాలు సహించవు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, మార్చి 2025 ||







## క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక

# పవిత్ర రంజాన్ మాసం

- పేద ముస్లింలను ఆర్థికంగా పైకి తీసుకొస్తాం
- వక్ఫ్ బోర్డు ఆస్తులను సంరక్షిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సీఎం
- మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన సీఎం చంద్రబాబు

**విజయవాడ:** విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.

'పేదరికంలో ఉన్న ముస్లిం కుటుంబాలను ఆర్థికంగా పైకి తీసుకొస్తాం. ముస్లింలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది. వక్ఫ్ బోర్డు ఆస్తులకు రక్షణ కల్పిస్తాం. ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉంది. 40 ఏళ్లుగా ఇఫ్తార్ విందులో పాల్గొంటున్నా. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ మాసం. రంజాన్ మాసమంతా కఠోర దీక్షతో ఉండే ముస్లిం సోదరులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఇదొక పవిత్రమైన ఆచారం. సమాజ శ్రేయస్సు కోసం ముస్లిం సోదరులు దువా చేస్తున్నారు. ఆర్థికంగా బాగున్నవారు పేదలకు సాయం చేయడమే ఖురాన్ నేర్పించిన మంచి గుణం' అని అన్నారు.

### ముస్లింలతో టీడీపీకి బలమైన అనుబంధం

'ముస్లింలతో టీడీపీకి బలమైన అనుబంధం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ముస్లింలకు మేలు జరిగింది టీడీపీ హయాంలోనే. మొట్టమొదటిసారి ఫైనాన్స్ కార్పొ రేషన్‌ను ఎన్టీఆర్ ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఉర్దూను రెండో భాషగా చేశాం. హైదరాబాద్ నుంచి మక్కాకు వెళ్లేందుకు హజ్ భవనం నిర్మించాం. వక్ఫ్ బోర్డు ఆస్తుల రక్షణకు టీడీపీ కృషి చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో, విభజన తర్వాత కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం.

కడపలో హజ్‌హౌస్ నిర్మించాం. విజయవాడలో నిర్మించతలపెడితే గత ప్రభుత్వం నిలిపేసింది. 2014-2019 మధ్య రూ.163 కోట్లతో 32,722 మంది మైనార్టీ వధువులకు దుల్హన్ సాయం అందించాం. పండుగ నాడు పేద ముస్లింలు పస్తులుండకూడదని రంజాన్ తోఫా అందించాం.' అని సీఎం అన్నారు.

### మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఇమామ్, మౌజన్‌లకు గౌరవవేతనం

మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగానే ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలకు గౌరవ వేతనం పెంచాం. మొన్నటి బడ్జెట్‌లో ముస్లిం మైనారిటీలకు రూ.5,434 కోట్లు కేటాయించాం. గత బడ్జెట్ కంటే రూ.13 వందల కోట్లు అదనంగా కేటాయించాం. మత సామరస్యాన్ని కాపాడటమే కాకుండా అన్ని విధాలా ముస్లింలను పైకి తీసుకొస్తాం. జకాత్ స్ఫూర్తితో మీరు సంపాదించిన దాంట్లో కొంత పేదలకు ఖర్చు చేసేందుకు ముందుకు రండి.

పేదరిక నిర్మూలన కోసం పీ4 కార్యక్రమాన్ని ఈ మాసంలోనే ప్రవేశపెడుతున్నాం. అగ్రభాగాన ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలకు సహకారం అందిస్తారు. ఇప్పటికీ పేదలు మూడు పూట్లా సరైన తిండి, చదువు లేక ఆర్థిక అసమానతలకు గురవుతున్నారు. నేను పేదల పక్షం ఉండాలనేది నా జీవితాశయంగా పెట్టుకున్నా. అందుకే పీ4 విధానంతో పేదరికం నుంచి పైకి తెచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.















జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, మార్చి 2025 ||

## దర్శిలో డిగ్రీ కాలేజీకి లోకేష్ హామీ!

◆ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెల్లడి

దర్శి, మహానాడు: తెలుగుదేశం పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, యువ నాయకుడు కడియాల లలిత్ సాగర్‌లు గురువారం ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని తన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాలపై డాక్టర్ లక్ష్మి దంపతులు లోకేష్‌కు వివరించారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియపై ఆయనతో మాట్లాడారు. దర్శి ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కూటమి ప్రభుత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దర్శి పట్టణంలో కురిచేడు రోడ్‌లోని మోడల్ స్కూల్ పక్కన ఉన్న ఆరు ఎకరాలలో ప్రతిపాదనలో ఉన్న డిగ్రీ కాలేజీ, స్కూలు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని లోకేష్ ని కోరారు. ఈ మేరకు 17 కోట్ల రూపాయల అంచనాలను లోకేష్‌కి అందించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మి తెలిపారు.





## శాసనమండలిలో పదవీ విరమణ చేసిన తొమ్మిది మంది ఎమ్మెల్సీలకు వీడ్కోలు

హైదరాబాద్: మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి విక్రమార్క , శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

### పదవీ విరమణ పొందిన ఎమ్మెల్సీలు

ఎంఎస్ ప్రభాకర్,మహమూద్ అలీ, టీ.జీవన్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, అలుగుబెల్లి నర్సిరెడ్డి,షేరి సుభాష్ రెడ్డి,కూర నరోత్తమ్ రెడ్డి,సత్యవతి రాథోడ్, మీర్జా రియాజుల్ హసన్ ఇఫేండిల సేవలను కొనియాడుతూ వారికి శాలువాలు, బొకేలు, మెమొంటోలతో సత్కరించారు.అనంతరం వారికి విందు ఏర్పాటు చేశారు.

## ఇన్‌ఛార్జి మేరకు శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేతలు


గుంటూరు, మహానాడు: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు గుంటూరు నగరపాలం సంస్థ ఇన్‌ఛార్జి మేయర్ షేక్ సజీలాను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంను అందించి, వారిని సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్తూరు వెంకట సుబ్బారావు, నేరెళ్ల



మాధవ రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బారావు, చరకా కుమార్ గౌడ్, సురేష్ జైన్, పురుషోత్తం, పురుషోత్తం, మందడపు సురేష్, నాగేశ్వరరావు మరియు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కొత్తపేట నూతన ఉప సర్పంచ్‌కు ఎమ్మెల్యే అభినందనలు

కొత్తపేట, మహానాడు: కొత్తపేట గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన విళ్ల మారుతీ ప్రసాద్‌ను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం అభినందించారు. పాలక మండలి సభ్యులంతా కలిసికట్టుగా పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. అభివృద్ధి



కూడా గ్రామంలో పూర్తి స్థాయిలో జరిగేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి భాస్కరరావు, బండారు బుల్లితాత, మిదే ఆదినారాయణ, ధరణాల రామకృష్ణ, బీర ఇస్సాక్, వాసంశెట్టి సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నక్యాంటీన్లలో ఆహార పదార్థాలు వేళకు అందుబాటులో ఉండాలి

గుంటూరు, మహానాడు: అన్నక్యాంటీన్లలో టిఫిన్, మధ్యాహ్నం, భోజనాన్ని ప్రభుత్వ నిర్దేశిత సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలని, శు




క్రవారం నుండే మార్చిన సమయాన్ని పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను, అక్షయపాత్ర సిబ్బందిని ఆదేశించారు. గురువారం చుట్టగుంట సెంటర్ లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, అన్న క్యాంటీన్లలో ఆహార సమయాలపై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

# నేటి రాజకీయ నాయకుల్లో ఎవరు తినడం లేదు?

◆ జగన్‌ను ప్రజలు మర్చిపోయారు

◆ కాంగ్రెస్ నుంచి ఎందరు వెళ్ళిపోయినా ఫర్వాలేదు

◆ కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

గుంటూరు, మహానాడు: ఢిల్లీలో ఒక జడ్జి ఇంట్లో 500 కోట్ల రూపాయలు డబ్బు దొరికింది. ఇది కేంద్ర ప్రభుత్వ వైఫల్యం. ఒక జడ్జి ఇంటికి పోవాలంటే, మంచినీళ్ల బాటిల్ ను కూడా చెక్ చేస్తారు. 500 కోట్ల రూపాయలు, జడ్జి ఇంటికి చేరిందంటే, ఇది ఒక రోజులో జరిగిన పని కాదు.

ఆ డబ్బు ఒక సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకు చెందినదని, న్యాయవాదులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఢిల్లీలో చెప్పుకుంటున్నారు. పోలీసులకు తెలియకుండా, కేంద్ర హోం మంత్రికి తెలియకుండా, ప్రధానికి తెలియకుండా అంత డబ్బు వెళ్లదు. దీనిపై విచారణ జరపాలి. పోలవరం డయాఫ్రమ్ వాల్, కాపర్ డ్యాం పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు. పోలవరం ఏటీఎం లాగా మారిందని ప్రధాని గతంలో అన్నారు. దీనిపై విచారణ ఎందుకు వేయలేకపోతున్నారు? చిలకలూరిపేటకు చెందిన ఒక మాజీ ఎమ్మెల్యే పై కోటి రూపాయలు తిన్నదని, ఆమెపై ఏసీబీ విచారణకు ఆదేశించారు. వేల కోట్ల రూపాయలు పోలవరం పై తిన్నారని ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ అనుకుంటే, సిబిఐ విచారణ కాదు కదా, కనీసం ఏసీబీ విచారణ కూడా జరిపించకపోవడంలో అంతర్యమేమిటి?

పోలవరంపై ఒక రకమైన ఆలోచన? చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే పై మరో రకమైన ఆలోచన ఎందుకు? తిమింగలాలను పట్టుకోకుండా, కుందేళ్ళను పట్టుకుంటున్నారు. ఒక బీసీ మహిళ పైన విచారణ సమంజసం కాదు. ఈ రోజున్న రాజకీయ నాయకుల్లో ఎవరు తినడం లేదు? వావిలాల గోపాలకృష్ణ తినలేదు. కాకాని వెంకటరత్నం తినలేదు. ఎన్జీరంగా తినలేదు. అటువంటి నాయకులు ఇప్పుడు లేరు.

అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని ప్రాంతాలు, అన్ని భాషలు కలిగినటువంటి దేశం భారతదేశం. గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన దేశం భారతదేశం. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు నిండింది. రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ హత్య రాజకీయ హత్య. మతాల మధ్య జరిగినటువంటి చిచ్చు. దీన్ని ఖండిస్తున్నాను. రాజమండ్రిలో పరిస్థితులు క్షుణ్ణంగా గమనిస్తూ వచ్చాను. ఎవరైనా కొంచెం రెచ్చగొట్టి ఉంటే, రాజమండ్రి రాజమండ్రిలా ఉండేది కాదు. రాష్ట్రం రావణకాష్ఠంగా అయివుండేది.



అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు మాల మాదిగ కులాల మధ్య చిచ్చు. స్టాలిన్ హిందీ పై మాట్లాడి భాషల మధ్య చిచ్చు. ఆయన అందుకున్న ఇంకో నినాదం డీలిమిటేషన్ చర్చ, ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశం. ఇది భారతదేశంలో ఉన్న పరిస్థితులు.

సీఎం చంద్రబాబు పీ4 గురించి మాట్లాడారు. విజయవాడ సిటీ లో, బీఆర్‌టీఎస్ రోడ్డులో వేలమంది పడుకుని ఉన్నారు. నిన్న నేను వెళ్లి వాళ్లతో మాట్లాడాను. మాకు ఆశ్రయం లేదని చెప్పారు. రాష్ట్రంలో, దేశంలో వున్న పేదరికాన్ని ఈ సంఘటన గుర్తు చేస్తోంది. బీటెక్ పాసైన వాళ్లు కూలి పనులకు వెళ్తున్నారు. ఎంబీఏ పాసైన వాళ్లు డ్రైవర్లుగా వెళ్తున్నారు. ఉద్యోగాలు ఎక్కడున్నాయి? హెయిర్ కటింగ్ పైన పన్ను. గుడ్డలు ఉతికే దానిపైన పన్ను. పన్నులు పెరగడం వల్ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వాళ్లు కొనలేని పరిస్థితి, తినలేని పరిస్థితిలో వున్నారు.

ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వర్గీకరణ కావాలి. కర్ణాటకలో మాదిరిగా, ఎస్సీ, ఎస్టీలకు 24%, ఓబీసీలకు 15% ప్రభుత్వ కాంట్రాక్టులు ఇవ్వాలి.

కర్ర తుమ్మ చెట్లు కొట్టడానికి గుంటూరు వాళ్ళు పనికిరారా? పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బడా కంపెనీకి 80 కోట్ల రూపాయల కాంట్రాక్టు పనులు ఇచ్చారు. ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయం చేస్తే, లక్షల కోట్ల రూపాయలు రుణాలు ఎవరు తీసుకుంటున్నారు? గుజరాతీలు, మార్వాడీలే తీసుకుంటున్నారు.

ఎస్సీ ఎస్టీలకు ఒక్క శాతం. ఓబీసీలకు రెండు శాతంలోపు రుణాలు బ్యాంకులు ఇస్తున్నాయి. ప్రధాని బ్యాంకుల్లో వర్గీకరణ చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వర్గీకరణ చేయాలి. శర్మ, వర్మ, శాస్త్రిలే సుప్రీంకోర్టు, రాష్ట్రాల హైకోర్టు జడ్జీలుగా ఉన్నారు. ఇక్కడ వర్గీకరణ తేవాలి. పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవుల్లో వర్గీకరణ జరగాలి.

ప్రధాని వారానికి ఒకసారి విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు. ఎందుకు వెళ్తున్నారో చెప్పరు. క్రితంలో ఎందరో ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, వాజపేయి విదేశాలకు వెళ్లే వాళ్ళు. మీడియాకు వివరాలు వెల్లడించే వాళ్ళు. జర్నలిస్టులు కూడా ప్రధానుల విదేశీ టూరులో ఉండేవాళ్ళు. ఇప్పుడు ఆ అనవాయితీ లేదు.

11 ఏళ్లలో ప్రధాని ఒక్క ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించలేదు. నిన్న జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చంద్రబాబులో ఫ్రస్టేషన్, ఆవేదన కనిపించింది. చంద్రబాబుకు ఉన్న బలం అంతా ఇంతా కాదు. బాబు, నితీష్ కుమార్ పై ఆధారపడి కేంద్ర ప్రభుత్వం నడుస్తోంది. ఒక్క ఫోన్ కాల్ చేస్తే, 50 వేల కోట్ల రూపాయలు కావాలంటే, చెక్ ఎత్తుకుని, ప్రధాని రావాలి. కానీ కేంద్ర ఆర్థిక మంత్రిని ఎన్ని సార్లు కలిసినా, నిధులు రావడం లేదని, ముఖ్యమంత్రి మదన పడుతున్నారు.

జగన్ ను ప్రజలు మర్చిపోయారు. అప్పుడప్పుడూ ఇస్తార్ విందులలో ఆయన కనిపిస్తున్నారు. కాంగ్రెస్ పై సానుభూతి మొదలైంది. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు, మైనార్టీలు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులలో కూడా సానుభూతి వుంది. కానీ కాంగ్రెస్ కు సంస్థాగతంగా చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి.

కాంగ్రెస్ నుంచి ఎందరు వెళ్లినా ఇబ్బంది లేదు. వెళ్లే వాళ్ళు ఇంకా ఎవరైనా ఉంటే చెప్పండి. శాలువా కప్పుతాం. కావాలంటే బొక్కాయ్ కూడా ఇస్తాం. కాంగ్రెస్ ను బలోపేతం చేసేందుకే, నా స్టడీ టూర్లు. కర్నూలు నుంచి, శ్రీకాకుళం వరకు పెద్ద పెద్ద లీడర్లతో మాట్లాడుతున్నాను. తగిన సమయం వచ్చినప్పుడు, వాళ్ళంతా కాంగ్రెస్ లోకి వస్తారు.

# పి-4.. ఉగాది నాడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

◆ సమాజంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అమరావతి వేదికగా ప్రారంభం

◆ 11వేల 500 మందిని ఆర్టీసీ బస్సుల్లో తరలించే ఏర్పాట్లు

◆ ఆరోజు సా.5గం.ల నుండి రాత్రి 7గం.ల వరకూ కార్యక్రమం

◆ ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారి, ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారిని నియమించాలి

◆ కలెక్టర్లను ఆదేశించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్



అమరావతి, మహానాడు: రాష్ట్ర సచివాలయం వెనుక పి-4 విధానాన్ని ఈనెల 30వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించనున్నారని, పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఈమేరకు గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం ద్వారా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. పి-4 (ప్రభుత్వ, ప్రవేట్, ప్రజల, భాగస్వామ్యం)తో సమాజం లోని పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకుని వారికి అండగా నిలిచి పేదరికం నుండి పైకి తీసుకురావాలనే ఆశయంతో పి-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వివరించారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న పి-4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉగాది పర్వదినం నాడు అమరావతి వేదికగా నిలవనుందన్నారు. 30వ తేదీ సాయంత్రం 5గం.ల నుండి రాత్రి 7గం.ల వరకూ ఈకార్యక్రమం జరగనుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుండి స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, రైతులు, ఉపాధి కూలీలను ఆహ్వానించి ప్రత్యేక బస్సులు ద్వారా వారిని అమరావతి పి-4 ప్రారంభోత్సవ వేదిక వద్దకు తీసుకురావాల్సి ఉంటుందని సిఎస్ చెప్పారు. సుమారు 11వేల 500 మందిని వారిలో సుమారు 3వేల మంది మహిళలు ఉండేలా ఈకార్యక్రమానికి తీసుకు రావాల్సి ఉందని తెలిపారు. అమరావతి సమీప జిల్లాలైన ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుండి సుమారు 7వేల మందిని, పల్నాడు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి కనీసం 500 మంది వంతున తీసుకు రావాలన్నారు. అదే మిగతా జిల్లాల నుండి 300 మంది వంతున, దూర ప్రాంత జిల్లాలైన మన్యం, అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అన్నమయ్య, కర్నూల్, అనంతపురం, శ్రీ సత్యసాయ జిల్లాల నుండి 50 మంది వంతున తీసుకురావాలని చెప్పారు. ఇందుకు అవసరమైన ఆర్టీసు బస్సులను ఆయా జిల్లాల నుండి అందుబాటులో ఉంచుతారని తెలిపారు. బస్సులు ద్వారా కార్యక్రమానికి తీసుకువచ్చే వారిని తిరిగి వారి గమ్యస్థానాలకు తిరిగి చేర్చేందుకు వీలుగా ట్రాఫిక్, భద్రత తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు తగిన ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలను తరలించే ప్రక్రియను రాష్ట్ర స్థాయి నుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయిలో స్టాంప్స్ అండి రిజిస్ట్రేషన్ శాఖ ఐజి హరినారాయణను మరో ముగ్గురు ఉన్నతాధికారులను నియమించామని, ప్రతి జిల్లాకు ఒక నోడలు అధికారిని, ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారిని నియమించాలని సీఎస్ కలెక్టర్లకు చెప్పారు.

ఈ సమావేశంలో రాష్ట్ర స్టాంప్స్ అండి రిజిస్ట్రేషన్ల శాఖ ఐజి హరినారాయణ, ప్రణాళికా శాఖ సంయుక్త కార్యదర్శి అనంత శంకర్ పాల్గొనగా వర్చువల్ గా ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఆర్టీసి ఎండి ద్వారకా తిరుమల రావు, సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలను తనిఖీ చేసిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు: జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా గురువారం స్థానిక మామిడిపాలెంలోని ఈ.వి.ఎం. గోదాములను సందర్శించారు. త్రైమాసిక తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాముల తలుపులు తెరిచి వాటిలో భద్రపరిచిన అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాల పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, రాజకీయ పార్టీల ప్రతినిధులు కోనేటి వెంకటరావు (టీ.డీ.పీ), దండు శ్రీనివాసరావు ( బిజెపి), ఎం. రమేష్ (జనసేన), దామరాజు క్రాంతి కుమార్ (వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ) , SK రసూల్ (కాంగ్రెస్), తదితరులు పాల్గొన్నారు. ఇ.వి.ఎం.ల పరిస్థితిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు.





గోర్ బోలి' భాష - రాజ్యాంగంలోని 8వ షెడ్యుల్ లో చేర్చాలని శాసనసభలో తీర్మానం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గిరిజన ఎమ్మెల్యేలు బాలునాయక్, రాంచంద్రు నాయక్, రాందాస్ నాయక్.

# యాదవులను అక్కున చేర్చుకున్న పార్టీ టీడీపీయే!

◆ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్

మంగళగిరి, మహానాడు: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ పార్టీ ఒక్కటే యాదవుల సంక్షేమం, వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని, అందుకే ఏ ఎన్నికలు వచ్చినా యాదవులంతా ఒక్కటై టీడీపీకి అండగా ఉండాలని యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్ కోరారు. ఈ మేరకు ఆయన కార్పొరేషన్ డైరెక్టర్‌లతో కలిసి గురువారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నరసింహ యాదవ్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండే టీడీపీలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చారు. అందులో యాదవులకు ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించిన చరిత్ర ఎన్టీఆర్, చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే..

గతంలో బీసీలు అంటే చులకన చూపు ఉండేది. టీడీపీ వచ్చిన తరువాత బీసీలకు వెన్నుదన్నుగా ఉంటూ అన్ని రంగాల్లో బలపరిచారు. వెనుకబడిన, పెదవర్గాల్లో వెలుగులు నింపిన పార్టీ టీడీపీ. యాదవ కార్పొరేషన్ చైర్మన్ గా నన్ను నియమించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్న. చంద్రబాబునాయుడు ఇచ్చిన అవకాశాన్ని యాదవుల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తా.

ఏప్రిల్ రెండోతేదీన విజయవాడ నడిబొడ్డున ఉన్న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నా ప్రమాణ స్వీకారం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి యాదవ ప్రముఖులు, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు అవుతున్నారు. యాదవ సోదరులు, బీసీలందరూ హాజరై విజయవంతం చేయాలి.



### గత ప్రభుత్వ పాలనలో ఉత్తుత్తి కార్పొరేషన్‌లు

గత ప్రభుత్వ పాలనలో అవినీతికి అడ్డేలేదు.. ఉత్తుత్తి చైర్మన్‌లను పెట్టుకుని ఉత్తుత్తి కార్పొరేషన్ లతో ప్రజలను మభ్యపెట్టి దోచుకున్నారు. కాని నేడు బడ్జెట్ లో కుల సంఘాలకు కార్పొరేషన్ల ద్వారా నిధులు కేటాయించారు. నేడు బడ్జెట్ లో కేటాయించిన నిధులు నేరుగా ఆయా సామాజిక వర్గాలకు చేరుతాయి. ఈ అవకాశం యాదవ యువతకు ఎంతో మేలు చేస్తుంది. వారి విద్యోన్నతికి దోహదపడుతుంది. కార్పొరేషన్ లలో ఎలాంటి డేటా లేదు. గత పాలన అంతా అస్తవ్యస్తంగా ఉంది. అందుకే రాష్ట్రంలో ఎంతమంది యాదవులు ఉన్నారో కూడా స్పష్టమైన లెక్క లేదు.

యాదవులు ఆకాంక్షలు సీఎం దృష్టికి తీసుకెళ్లి వారు మెచ్చుకునేలా కార్పొరేషన్ ద్వారా నా వంతు నేను కృషి చేస్తా. రాష్ట్రంలోని యాదవుల సమస్యలపై మంత్రి నారా లోకేష్ దృష్టి సారించారు. యాదవుల సమస్యల పరిష్కారానికి యాదవ సంఘ నాకులతో మాట్లాడి.. సరైన నిర్ణయాలు తీసుకుంటాం. రాష్ట్రంలో పేద వర్గాల బిడ్డలకు ఉద్యోగ కల్పన కోసం కేంద్ర సహకారంతో ముఖ్యమంత్రి, నారాలోకేష్, పవన్ కల్యాణ్ లు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. చీఫ్ సెక్రటరీతో పాటు, రాష్ట్ర పార్టీ అధ్యక్షపదవి, తిరుపతి అర్బన్ డవలప్ మెంట్ చైర్మన్ పదవే కాకా అనేక పదవుల్లో యాదవులను ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టిన పార్టీ ఏదైనా ఉందంటే అది టీడీపీ పార్టీనే. టీడీపీ పార్టీకి మరో పేరు ఏదైనా ఉంది అంటే అది యాదవుల పార్టీ. బీద రవిచంద్ర ఎమ్మెల్సీ ఇవ్వడమే దీనికి ఉదాహరణ.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, మార్చి 2025 ||



# కన్నింగ్‌తో పోలవరాన్ని బలిపీఠం ఎక్కించిన జగన్!

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శ



**చిలకలూరిపేట, మహానాడు:** రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు పోలవరాన్ని పూర్తిచేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందని, ప్రాజెక్ట్ ను అనుకున్నవిధంగా పూర్తి చేయాలన్న గట్టి పట్టుదలతో చంద్రబాబు ఉన్నారని మాజీ మంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. 9 నెలల్లో మూడోసారి చంద్రబాబు పోలవరం ప్రాజెక్ట్ ను పరిశీలించారని, జగన్ మోసానికి బలైన నిర్వాసితులకు అండగా నిలవనున్నారని మాజీ మంత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నింగ్ ఆలోచనలు, కమీషన్ల కక్కుర్తితో గత పాలకులు పోలవరాన్ని బలిపీఠం ఎక్కించారని విమర్శించారు.

అధిక పరిహారం ఆశచూపి నిర్వాసితులను నమ్మించి కొండలు గుట్టల పాలు చేశారు. వరదల వేళ వారికి సరైన ఆహారం, మంచినీరు కూడా అందించలేదు. వైసీపీ ప్రభుత్వ వంచనతో విసిగిపోయిన ప్రాజెక్ట్ నిర్వాసితులు ఒకానొకదశలో తమ ఊళ్లను తెలంగాణ ప్రభుత్వంలో కలపాలని మొరపెట్టుకునే పరిస్థితికి వచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. స్వార్థ ప్రయోజనాలతో పొరుగు రాష్ట్రంతో లాలూచీపడి ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించింది గత ప్రభుత్వం కాదా? కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి వెళ్లడం ద్వారా పోలవరం నిర్మాణాన్ని, రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను, ప్రజల నీటి అవసరాలను జగన్ ప్రశ్నార్థకంగా మార్చలేదా? అని ఆయన ప్రశ్నించారు.

# రెండు ప్రాణాలను నిలిపిన ఒక మెస్సేజ్!

- శరవేగంగా స్పందించిన మంత్రి నారా లోకేష్
- సొంత ఖర్చులతో ప్రత్యేక విమానం, గ్రీన్ ఛానల్ ఏర్పాటు

**గుంటూరు, మహానాడు:** మంత్రి నారా లోకేష్‌కి చేసిన ఒక్క మెసేజ్ తో ఒకరి అవయవ దానం..మరొకరికి ప్రాణదానం జరిగింది. ఆ మెస్సేజ్‌తో మంత్రి లోకేష్ గుండె తరలించేందుకు సొంత ఖర్చుతో ప్రత్యేక విమానం, గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేశారు. బ్రెయిన్ డెడ్ అయిన మహిళ చెరుకూరి సుష్మ అవయవదానంతో తిరుపతిలో మరొకరికి ప్రాణదానం చేశారు వైద్యులు. సకాలంలో స్పందించిన మంత్రి నారా లోకేష్‌కి రమేష్ హాస్పిటల్స్, అవయవ దాత, స్వీకర్త కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి. గురువారం సాయంత్రం 7గం.30ని.లకు గ్రీన్ ఛానెల్ ద్వారా గుండెను గుంటూరు రమేష్ ఆసుపత్రి సిబ్బంది తరలించారు.

ఇక గుంటూరు రమేష్ హాస్పిటల్స్ లో తీవ్ర అనారోగ్యంతో చేరిన చెరుకూరి సుష్మ బ్రెయిన్ డెడ్ అయ్యారు. జీవచ్ఛవంలా మారిన తమ ఇంటి వెలుగు సుష్మ మరణం సజీవం చేయడానికి కుటుంబ సభ్యులు స్వచ్ఛంద నిర్ణయంతో మరో కుటుంబంలో వెలుగులు నింపాయి. ఆమె కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు.





వెంటనే రమేష్ హాస్పిటల్స్ గుంటూరు వైద్యులు ఆగమేఘాలపై అవయవాలు తరలించి మరికొందరికి ప్రాణదానం చేసే అవకాశం కల్పించాలని మంత్రి నారా లోకేష్‌కు ఒక్క మెసేజ్ పంపారు. క్షణాల్లో స్పందించిన మంత్రి గుండె తరలింపునకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్‌కు రూ.50 లక్షల విరాళం!

- పరమేసు బయోటెక్ లిమిటెడ్ ను అభినందించిన లోకేష్

**అమరావతి, మహానాడు:** కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ కు పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన పరమేసు బయోటెక్ లిమిటెడ్ రూ.50 లక్షల విరాళం అందజేసింది. ఈ మేరకు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద స్వరూప్ అదవానీ ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిసి చెక్ అందజేశారు. ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు, విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ కు విరాళం అందజేసిన పరమేసు బయోటెక్ లిమిటెడ్ ప్రతినిధులను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు.



# భూముల వేలం వద్దని అప్పుడు మీరే సెలవిచ్చారు సారూ!

- ఇప్పుడు మీరే భూములు వేలం వేస్తే ఎలా కుదురుతుంది?
- ఆ భూముల్లో వృక్ష,జంతుజాలం ఉన్నాయి కదా?
- పర్యావరణానికి మీరు చేయబోయే ఈ నష్టం తిరిగి పూడ్చలేనిది
- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగలేఖ

**హైదరాబాద్:** ఆర్థిక వనరుల సమీకరణ పేరుతో టిజిఐఐసి ద్వారా గచ్చిబౌలి గ్రామంలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలానికి పెట్టే ప్రక్రియను నిలిపివేయాలని కేంద్రమంత్రి, కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు.పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ప్రభుత్వ భూముల అమ్మకాలపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ఆయనకు గుర్తు చేశారు. ఆ భూముల్లో వృక్ష-జంతుజాల సంపద ఉందని పేర్కొన్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా వేలం ప్రక్రియను నిలిపివేయాలని సూచించారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ పూర్తి పాఠమిది.

తేదీ : 27.03.2025

గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, నమస్కారం

విషయం : ఆర్థిక వనరుల సమీకరణ పేరిట తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలికసదుపాయాల సంస్థ (TGIIC) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయదలచిన రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, కంచ గచ్చిబౌలి గ్రామంలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమి వేలం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ వ్రాస్తున్న లేఖ.

ఆర్థిక వనరుల సమీకరణ పేరిట రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25(పి) లో ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ భూమిని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలికసదుపాయాల సంస్థ ద్వారా వేలం వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

గతంలో మీరు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భవిష్యత్తు తరాలను, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా మాట్లాడారు. "మనం బ్రతకడానికి, మన సోకులకు ప్రభుత్వ భూములు అమ్మొద్దు, ఒకవేళ ప్రభుత్వ భూములను అమ్మితే భవిష్యత్తులో ప్రజల అవసరం కోసం ఏదైనా నిర్మించాలన్నా, ప్రభుత్వ ఆసుపత్రులు కానీ, విద్యాలయాలు కానీ, చివరకు చచ్చిపోతే స్మశానాలకు కూడా భూమి లేని పరిస్థితి ఉంటుంది" అని గతంలో మీరన్న మాటలను ఈ సందర్భంగా ఒకసారి గుర్తు చేస్తున్నాను.

నేడు మీరు వేలం వేయాలని నిర్ణయం తీసుకున్న ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూమికి ఆనుకుని జీవవైవిధ్యానికి నెలవైన అనేక వృక్షజాలం, జంతుజాలం, సరస్సులు ఉన్నాయి. ఇందులో 734 వృక్ష జాతులు, 220 పక్షి జాతులతో సహా నెమళ్లు, వలస పక్షులు, మచ్చల జింకలు, నాలుగు కొమ్ముల జింకలు, అడవి పందులు, కొండ చిలువలు, భారతీయ నక్షత్ర తాబేళ్లు వంటి వైవిధ్యభరితమైన జీవజాతులు, మష్రూమ్ రాక్ తో సహా సహజసిద్ధంగా ఏర్పడి ఎంతో ఆకర్షణీయంగా ఉండే రాళ్ళ అమరికలెన్నో ఉన్నాయని అనేకమంది ప్రముఖులు తెలియజేస్తున్నారు.



మీరు వేలం వేయాలని నిర్ణయం తీసుకున్న ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూమి అటవీశాఖ పరిధిలోకి రానప్పటికీ, చుట్టూ పచ్చని చెట్లతో, వైవిధ్యమైన జీవజాతులతో కూడిన ఈ భూమి నగరానికి ఊపిరులూదే ఒక ఆక్సిజన్ వనరుగా ఉంది. అలాంటి ఈ భూమిని కాంక్రీట్ నిర్మాణాలతో నింపేస్తే, భూమిలో నీటివనరులు తగ్గిపోయి, ఆయా జీవజాతులకు నష్టం జరిగి, పర్యావరణానికి, నగరానికి పెద్దఎత్తున ముప్పు చేకూరే అవకాశం ఉంది. పర్యావరణానికి మీరు చేయబోయే ఈ నష్టం తిరిగి పూడ్చలేనిది.

ముఖ్యంగా ఈ భూమి పరిధిలో ఉన్న భారతీయ నక్షత్ర తాబేళ్ళకు, వాటి ఆవాసాలకు ముప్పు పొంచి ఉండటం ఆందోళనకరం. వన్యప్రాణుల సంరక్షణ చట్టం, 1972 లోని షెడ్యూల్ IV కింద భారతీయ నక్షత్ర తాబేళ్ళు సంరక్షించవలసిన జీవజాతుల కిందకు వస్తాయి. ఈ చట్టంకింద ఆయా జీవజాతుల సంరక్షణతోపాటు, వాటి ఆవాసాలను కూడా సంరక్షించాలి. ఈ నక్షత్ర తాబేళ్ళు 2016 నుంచి IUCN (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్)లో దుర్భలమైన జాబితాలో చేర్చబడి ఉన్నాయి. అంటే, ఇది అంతరించిపోతున్న వాటి జీవజాతిని సూచిస్తుంది.

అంతేకాకుండా ఈ నక్షత్ర తాబేళ్ళు 2019 నుంచి అంతర్జాతీయ వాణిజ్యంలో అంతరించిపోతున్న వృక్ష, జంతుజాలం (CITES – కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్ డేంజర్డ్ స్పీసిస్ ఆఫ్ వైల్డ్ ఫ్లోరా & ఫానా) కన్వెన్షన్ యొక్క అపెండిక్స్‌లో కూడా చేర్చబడి ఉన్నాయి.

అంటే ఆయా జీవజాతులకు అంతర్జాతీయ వాణిజ్యం నుంచి అత్యున్నత స్థాయిలో రక్షణ కూడా కల్పించబడి ఉంది. కాబట్టి, వన్యప్రాణుల సంరక్షణ చట్టం, 1972 నిబంధనల ప్రకారం ఇప్పుడు మీరు వేలం వేయాలని నిర్ణయం తీసుకున్న 400 ఎకరాల భూమిని, దానిని ఆనుకుని ఉన్న 800 ఎకరాల భూమిని కలిపి జాతీయ ఉద్యానవనంగా ప్రకటించే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాలి.

నగరంలో ఒకప్పుడు అడవులను, కొండలను తలపించే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాలు పట్టణీకరణ కారణంగా ఒక కాంక్రీట్ అడవిలాగా మారిపోయి సహజసిద్ధమైన వాటి స్వరూపాన్ని కోల్పోయాయి.

ఆయా ప్రాంతాలలో ఎక్కడా ఒక చెట్టును, పుట్టను, కొండను వదలకుండా మొత్తం కాంక్రీట్ నిర్మాణాలతో నింపేశారు. ఇవి చాలవన్నట్లు ఆర్థిక వనరుల పేరిట ఇప్పుడు పర్యావరణ వైవిధ్యంలో భాగమైన భూములను కూడా కాంక్రీట్ అడవులుగా మార్చడం స్థానికంగా నివశిస్తున్న ప్రజలు, ఆ భూమికి పక్కనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో చదువుతున్న విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు ఇలా ఎవరికీ కూడా ఆమోదయోగ్యం కాదు.

ఇప్పటికే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో పచ్చదనం పూర్తిగా తగ్గిపోతోంది, ఖాళీ స్థలాలు అనేక కారణాలతో కనుమరుగవుతున్నాయి. నగరంలో ఆట స్థలాలు, వాకింగ్ ట్రాక్ లు, పార్కులు, పర్యావరణ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నవి. భవిష్యత్తు తరాల కోసం కొంతయినా ఈ స్థలాలను రక్షించవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నది.

కావున, ప్రభుత్వ భూముల అమ్మకంపై గతంలో మీరు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు కట్టుబడి ఉంటారని, సహజసిద్ధంగా ఏర్పడిన కొండలతో సహా పర్యావరణ, జీవ వైవిధ్యానికి ఎలాంటి నష్టం చేకూర్చకుండా సంరక్షిస్తారని, ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూముల వేలం ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని మనవి చేస్తున్నాను.

## గుంటూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రేసులో
# సీనియర్ టిడిపి నేత ముత్తినేని రాజేష్

**గుంటూరు నగర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు మాజీ కార్పోరేటర్ ముత్తినేని రాజేష్**


**గుంటూరు, మహానాడు:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు పిలుపు మేరకు 1988 విద్యార్థి దశ నుండి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ 1989లో జరిగిన సార్వత్రిక ఎన్నికల దగ్గర నుండి తెలుగుదేశం పార్టీలో పనిచేస్తూ 1991లో జరిగిన పార్లమెంట్ ఎలక్షన్స్ లో స్వర్గీయ లాల్ జాన్ బాషా విజయం కోసం విద్యార్థి దశ నుండే పనిచేయటం జరిగినది.

1995లో తెలుగుదేశం పార్టీలో జరిగిన పరిణామాలలో తమరికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఒక రాజ్యాంగేతర శక్తికి వ్యతిరేకంగా నందమూరి హరికృష్ణతో పాటు పోరాటం చేయటం జరిగింది. అప్పటి నుండి తెలుగు యువత కమిటిలలో ఉంటూ 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో పార్లమెంటు సభ్యులుగా కీ.శే. వై.వి. రావు మరియు శాసనసభ్యులుగా శనక్కాయల అరుణ విజయం కోసం తీవ్రంగాకృషిచేసిన ఫలితంగా 2000, మార్చిలో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున 9వ డివిజన్ నుండి కార్పోరేటర్ అభ్యర్థిగా అవకాశం వచ్చి విజయం సాధించటం జరిగినది. అప్పటి నుండి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సభ్యునిగా ఉంటూ అటు కార్పోరేషన్లో మరియు పార్టీలో క్రియాశీలంగా ఉంటూ అంకితభావంతో నిజాయితీగా పనిచేయటం జరిగినది.2005లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున 37వ డివిజన్ నుండి రెండవసారి కార్పోరేటర్ విజయం సాధించుట జరిగినది. మన పార్టీ ప్రతిపక్షంలో ఉన్న ప్రతిసారీ తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం కొరకు ప్రతినిత్యం పనిచేయుచూ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండుట జరిగినది. 2010 నుండి ఇప్పటి వరకు 14 సం?లు నగర పార్టీ ప్రధాన కార్యదర్శిగా నా కర్తవ్యాన్ని నిర్వర్తించుచూ పార్టీకిగానీ, పార్టీ సానుభూతిపరులకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ నగరపాలక సంస్థలో మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి ఏ అవసరం వచ్చినా పార్టీ తరుపున వారికి సేవలందించుట జరిగినది. 2013లో మీరు చేపట్టిన "వస్తున్నా మీకోసం" పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాలలో మీ కార్యక్రమము విజయవంతం చేయుట కొరకు తీవ్రంగా కృషి చేయుట జరిగినది.2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో పార్లమెంట్ సభ్యులుగా గల్లా జయదేవ్, శాసనసభ్యులుగా వేణుగోపాల్ రెడ్డి గారి విజయం కోసం అనేక వ్యయప్రయాసలతో వారి గెలుపునకు కృషి చేసియున్నాను.అలాగే 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో పార్లమెంట్ సభ్యులుగా గల్లా జయదేవ్ మరియు శాసనసభ్యులుగా మద్దాళి గిరికి చీఫ్ కలక్షన్ ఏజెంట్‌గా ఉంటూ వారి విజయం కోసం అహర్నిశలు కృషి చేసి వారి గెలుపు సాధించటమైనది. అప్పటి నుండి నగరపాలక సంస్థ ఎన్నికల కోసం ఎదురుచూస్తు 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో 37వ డివిజన్ నుండి తిరిగి పోటి చేయుటకు అవకాశం వచ్చినప్పటికీ మీరు మరియు రాష్ట్ర మరియు జిల్లా తెలుగుదేశం పార్టీ పెద్దలు చేసిన విజ్ఞప్తి మేరకు అప్పటి తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి కొరకు నా అభ్యర్థిత్వాన్ని పార్టీ శ్రేయస్సు కోసం వదులుకోవటం జరిగినది.2019 నుండి "సైకో జగన్" పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ పార్టీ చేపట్టిన అనేక కార్యక్రమాలలో పాల్గొంటు అనేక ఇబ్బందులకు గురైనను విజయం కొరకు కృషి చేసియున్నాను. నారా లోకేష్ గారు చేపట్టిన "యువగళం" కార్యక్రమానికి మా వంతుగా అనేక జిల్లాల్లో పాల్గొని కార్యక్రమ విజయానికి పనిచేసియున్నాను. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో పార్లమెంటు సభ్యులు డా. పెమ్మసాని చంద్రశేఖర్ శాసనసభ్యులుగా గల్లా మాధవిగారి విజయంకోసం అహర్నిశలు కృషి చేసి ఘన విజయం సాధించుటలో నా వంతు పాత్ర నిర్వహించియున్నాను. కావున తమరు నా పనితీరును పరిశీలించి నాకు గుంటూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నియమించవలసినదిగా మిమ్ములను ప్రార్థించుచున్నాను.





ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు ఈ మేరకు తన వినతీపత్రాన్ని అందజేసి ఈ పదవిపై ఆశలు పెంచుకున్నారు



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

11

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, మార్చి 2025



## ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు బైలింగ్వల్ లాంచ్

ప్రదీప్ రంగనాథన్ తను దర్శకత్వం వహించిన బ్లాక్ బస్టర్ 'లవ్ టుడే'తో నటుడిగా అరంగేట్రం చేసాడు, ఆ తర్వాత తమిళం, తెలుగు రెండింటిలోనూ విజయం సాధించిన తన రీసెంట్ హిట్ 'డ్రాగన్' తో మ్యాసీవ్ పాపులరిటీ సాదించారు. వరుస విజయాలతో, ప్రదీప్ రంగనాథన్ తమిళ సినిమాల్లోనే కాకుండా తెలుగులో కూడా పేరు తెచ్చుకున్నాడు. పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా తమిళం-తెలుగు ద్విభాషా ప్రాజెక్టును అనౌన్స్ చేసింది. గతంలో అనేక సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులకు అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసిన కీర్తిశ్వరన్ ఈ చిత్రం డైరెక్టర్ పరిచయం కానున్నారు. చ%లా=%04 చిత్రం ఈరోజు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు వేడుకలోని ఫస్ట్ విజువల్స్ ప్రదీప్ రంగనాథన్ నటించిన ఆసక్తికరమైన సన్నివేశాన్ని రివిల్ చేశాయి, ఇది ఒక ఇంటెన్స్ లో ప్రారంభమై, ఒక ఫన్ ఫుల్ కిస్ తో ముగుస్తుంది, ఇది న్యూ ఏజ్ కథాంశంతో కంప్లీట్ ఎంటర్టైనర్ గా ఉండబోతోంది. 'ప్రేమలు' చిత్రంతో అందరినీ అలరించిన మమిత బైజు హీరోయిన్ గా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్ కోసం ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ ని ఎంపిక చేసింది.

ఈ చిత్రానికి సంగీతం యంగ్ సెన్సేషన్ సాయి అభ్యాంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్‌గా, భరత్ విక్రమన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.






## ఫిల్మ్ అండ్ టీవీ డైరెక్టరీ డిజిటల్ మీడియా అవార్డ్స్

డిజిటల్ మీడియా రంగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన వారిని సత్కరించేందుకు నిర్వహించిన వి.బి. ఎంటర్‌టైన్‌మెంట్స్ డిజిటల్ మీడియా అవార్డ్స్-2025' వేడుక. ఈ వేడుకలో డిజిటల్ మీడియా రంగంలో వివిధ విభాగాల్లో విజేతలు అవార్డులు అందుకున్నారు. వి.వి.కె సంస్థ సమర్పణలో వీబి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 'వి.బి.ఎంటర్‌టైన్మెంట్స్' అధినేత ఇంకా 'ఈసీ మెంబర్ ఆఫ్ మా' అయిన విష్ణు బొప్పన ఫౌండర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విజేతలు అవార్డులు అందుకుని, తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విజేతలకు సీనియర్ ప్రొడ్యూసర్ అంబికా కృష్ణ చేతుల మీదుగా అవార్డ్స్ అందాయి. ఈ నేపథ్యంలో అంబికా కృష్ణ మాట్లాడుతూ.. విజేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రింట్ మీడియా కంటే డిజిటల్ మీడియా ఇంకా బాగా అభివృద్ధి చెందింది అన్నారు. డిజిటల్ మీడియా ప్రజలకు ఇంకా ఎన్నో మంచి వార్తలు ఇవ్వాలని కోరుకుంటున్నా అన్నారు. అలాగే విష్ణు గురించి కూడా ఈ సందర్భంగా మాట్లాడారు. ఆయన చేసిన మంచి పనులని తెలియజేశారు. గత 10 సంవత్సరాల నుంచి చిన్న పిల్లలకు విష్ణు ఎన్నో విధాలుగా సాయపడ్డారని గుర్తు చేశారు. అనాధ పిల్లలకు అండగా నిలిచారని అన్నారు.

## పెద్దిగా రామ్‌చరణ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన 16వ చిత్రంతో వెండితెరపై తుపాను సృష్టించటానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత, ఉప్పెన ఫేమ్..దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందిస్తోన్న చిత్రంతో ప్రేక్షకులను అలరించటానికి సిద్ధమవుతున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ పాన్-ఇండియా సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తోంది, సుకుమార్ రైటింగ్స్ సృజనాత్మక శక్తి కూడా తోడవుతుంది. ఈ హ్యూజ్ బడ్జెట్ మూవీని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నిజమైనత తుపాను రాక మునుపే మేకర్స్ దాని రాకను తెలియజేసేలా ప్రీ లుక్‌ను విడుదల చేసి సినిమాపై అందరిలో ఆసక్తిని మరింతగా పెంచారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలను తెలియజేస్తూ మేకర్స్ సినిమా టైటిల్‌ను 'పెద్ది' అని అనౌన్స్ చేశారు. ఈ టైటిల్ రామ్ చరణ్ పాత్రలోని శక్తి, గాంభీర్యాన్ని సంపూర్ణంగా, గొప్పగా తెలియచేస్తోంది. 'పెద్ది' సినిమా కోసం రామ్ చరణ్ అందరూ ఆశ్చర్యపోయి చూసేలా తన లుక్‌ను రగ్డ్‌గా మార్చుకోవటం విశేషం. ఈ రా క్యారెక్టర్‌లో నటించటానికి ఆయన స్టార్ ఇమేజ్‌ను పక్కకు పెట్టి ఇంటెన్స్, రియల్‌గా కనిపించే ప్రయత్నం చేశారు. ఇది వరకు రామ్ చరణ్ కనిపించనటువంటి సరికొత్త లుక్ ఇది. పదునైన చూపులు, గజిబిజి జుట్లు, గుబురు గడ్డం, ముక్కుకి రింగు, మాసిన బట్టలు, సిగరెట్ తాగుతూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించే అవతార్‌లో కనిపిస్తున్నారు చరణ్. మరో పోస్టర్‌ను గమనిస్తే పాత క్రికెట్ బ్యాట్‌ను పట్టుకుని ఫ్లడ్ లైట్ వెలుతురులో ఓ గ్రామంలోని స్టేడియంలో నిలుచుని ఉన్నాడు. ఈ రెండు పోస్టర్స్ సినిమాలో హీరో పాత్ర నేపథ్యాన్ని, కథ, కథనం.. గ్రామీణ వాతావరణంలోని తీవ్రత, నాటకీయత సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. డైరెక్టర్ బుచ్చిబాబు సానా రామ్ చరణ్ పాత్రను ఎంతో జాగ్రత్తగా రూపొందించినట్లు పోస్టర్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. తను చెప్పాలనుకున్న విషయాలను పోస్టర్స్ రూపంలో చూపెట్టారు. హీరో రా క్యారెక్టర్ తన పాత్రలోని ఇతర భావాలను చెప్పేలా పోస్టర్స్‌ను డిజైన్ చేశారు. రామ్ చరణ్ తన పాత్రకు ప్రామాణికతను తీసుకురావడానికి.. బుచ్చిబాబు ఏదో కొత్తదనాన్ని సృష్టించేందుకు.. తమ నిబద్ధతను చూపిస్తున్నారు.



## ఇలాంటి సినిమాలు ఆరోగ్యానికి చాలా మంచిది

### - 'మ్యాడ్ స్క్వేర్'

బ్లాక్‌బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్ గా రూపొందిన 'మ్యాడ్ స్క్వేర్'పై భారీ అంచనాలు ఉన్నాయి. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. భీమ్స్ సిసిరోలియో పాటలను స్వరపరచగా,



తమన్ నేపథ్య సంగీతం అందించారు. ఈ వేసవికి వినోదాల విందుని అందించడానికి 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం మార్చి 28న థియేటర్లలో అడుగుపెడుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు విశేషంగా ఆకట్టుకొని.. ఈ సినిమా సంచలన విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని కలిగించాయి. బుధవారం సాయంత్రం ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ లో వైభవంగా నిర్వహించారు. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుకలో ప్రముఖ దర్శకులు మారుతి, వెంకీ అట్లూరితో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అక్కినేని నాగచైతన్య మాట్లాడుతూ, "మ్యాడ్ స్క్వేర్ ట్రైలర్ చూశాను. అది మ్యాడ్ స్క్వేర్ కాదు, మ్యాడ్ మ్యాక్స్. ట్రైలర్ చాలా బాగుంది. నాకు ఈ వేడుకకు రావడం సంతోషంగా ఉంది. నేను మ్యాడ్ సినిమాలోని కామెడీ సీన్స్ చూస్తూ, ఒత్తిడిని దూరం చేసుకుంటూ ఉంటాను. ఇలాంటి సినిమాలు ఆరోగ్యానికి చాలా మంచిది. డల్ గా ఉన్నప్పుడు మ్యాడ్ లాంటి సినిమా చూడమని డాక్టర్లు కూడా సూచించాలనేది నా అభిప్రాయం. ఇలాంటి సినిమాలు చూడటం వల్ల.. ఫ్రెండ్స్, ఫ్యామిలీతో కలిసి సరదాగా గడిపేలా చేస్తాయి. ఫ్రెండ్ షిప్ ని స్ట్రాంగ్ చేస్తాయి. కొత్త ఫ్రెండ్స్ ని పరిచయం చేస్తాయి. మ్యాడ్ లాంటి సినిమాలు రావడం సంతోషంగా ఉంది. మ్యాడ్ సినిమాతో ఈ ముగ్గురు హీరోలు స్టార్స్ అయిపోయారు. ప్రతి ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిలా వీళ్ళ పేర్లను గుర్తు పెట్టుకుంటారు. కామెడీ చేయడం అనేది చాలా కష్టం. నార్నె నితిన్, రామ్, సంగీత్ లో ఆ టాలెంట్ ఉంది కాబట్టే ఇంత నవ్వించగలిగారు. ఒక స్టోరీ డిస్కషన్ లో దర్శకుడు కళ్యాణ్ తో కూర్చున్నప్పుడు ఆయన నేరేషన్ కే పడిపడి నవ్వాను. ఇక ఈ సినిమా ఎలా ఉంటుందో ఊహించగలను.

నా ఫేవరెట్ డీఓపీ శామ్‌దత్ గారు ఈ సినిమాకి పనిచేశారు. నిర్మాతగా హారిక మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. నాది, నాగవంశీ జర్నీ ప్రేమమ్ తో మొదలైంది. తన ధైర్యమే నాగవంశీని ఇంతదూరం తీసుకొచ్చింది. దర్శకులకు, నటులకు ఎంతో ధైర్యాన్ని ఇస్తూ వరుస విజయాలు అందుకుంటున్నారు. అలాగే నిర్మాత చినబాబు గారు అంటే నాకు ఎంతో ఇష్టం. మ్యాడ్ స్క్వేర్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.

మంచి ఓపెనింగ్స్ వచ్చి, సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. మ్యాడ్ 2 మాత్రమే కాదు, మ్యాడ్ 100 కూడా రావాలని కోరుకుంటున్నాను. టీం అందరికీ ఆల్ ది బెస్ట్" అన్నారు.

## 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' కూల్ & బ్రీజీ ఫస్ట్ లుక్

మత్తువదలరా, సూపర్ హిట్ సిరీస్ వికటకవిలో తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న హీరో నరేష్ అగస్త్య తన నెక్స్ట్ ప్రాజెక్ట్ సైన్ చేశారు- విపిన్ దర్శకత్వంలో సునేత్ర ఎంటర్‌టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై ఉమా దేవి కోట నిర్మించిన ఈ మూవీ కంటెంట్-రిచ్ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా. కూల్, బ్రీజీ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ను రివిల్ చేశారు. ఈ సినిమాకు 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' అనే ప్లజెంట్ టైటిల్ పెట్టారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో నరేష్ అగస్త్య చీర్ ఫుల్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. రబియా ఖటూన్ ఛార్మింగ్ గా కనిపించింది. వారి మధ్య పొగమంచు కొండ ప్రాంతం, ప్రశాంతమైన నేపథ్యం మధ్య ఉంచబడిన గిటార్ మూవీ మ్యూజిక్ బ్యాక్ డ్రాప్ ని సూచిస్తుంది. ఇది లవ్, డ్రీమ్స్, బ్యూటీఫుల్ కథని తెలియేస్తోంది. సుమన్, ఆమని ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీకి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు.

మోహన కృష్ణ సినిమాటోగ్రఫీ, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి, వెటరన్ తోట తరణి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్. మేఘలు చెప్పిన ప్రేమ కథ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌తో చాలా క్యురియాసిటీ క్రియేట్ చేసింది.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144